RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 20 ఆగస్ట్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:71

## ఉచిత విద్యుత్ బ్రాండ్ కాంగ్రెస్‌దే

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**వరి వద్దన్నా వేసిన రైతులకు అండగా ఉంటాం**

**చెరువుమాదారం 'మోడల్ సోలార్ విలేజ్'గా గుర్తింపు**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజాబలం:**వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా వరి వద్దని చెప్పినా పంట వేసిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నీటి ఎద్దడి వల్ల ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తుందని, అయితే ఇప్పటివరకు సాగు ప్రారంభించని రైతులు మాత్రం ఆరుతడి లేదా ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాలని సూచించారు. బుధవారం నేలకొండపల్లి మండలంలో మంత్రి పొంగులేటి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.



ఇంటింటికీ సోలార్ విద్యుత్ వెలుగులు

చెరువుమాదారంలో నిర్వహించిన పునరుత్పాదక ఇంధన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ఉచిత విద్యుత్ భావనకు మూలరూపం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఉద్ఘాటించారు. చెరువుమాదారాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటికీ రూ. 1.40 లక్షల వ్యయంతో సోలార్ అమర్చామని, ఉచిత విద్యుత్ వినియోగం పోను మిగిలిన కరెంటును ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆ మొత్తాన్ని నేరుగా వినియోగదారుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. భవిష్యత్తులో గృహజ్యోతి లబ్ధిదారులతో పాటు వ్యవసాయ మోటార్లకు కూడా సోలార్ ప్లాంట్లు ఇస్తామని తెలిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. కాంగ్రెస్‌లోకి చేరికలు

బుద్ధారంలో రూ. 1.97 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు , కొంగరలో రూ. 1.05 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో కొంగర గ్రామానికి చెందిన స్వతంత్ర సర్పంచ్ మల్లెంపూడి కృష్ణకుమారి వార్డు సభ్యులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం నేలకొండపల్లి, బోదులబండ, చెన్నారం, ఆచార్యులగూడెం గ్రామాల్లో పర్యటించి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## నీట్, రామ మందిర విరాళాలపై దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు

**లోక్‌సభ సీట్ల పెంపును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేసిన కాంగ్రెస్**

**ప్రస్తుత 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్**

**800 పట్టణాలకు విస్తరించనున్న రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్'**

కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం, రామ మందిర విరాళాల్లో చోటుచేసుకున్నాయన్న అవకతవకల ఆరోపణలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ కార్యవర్గ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించింది. పార్లమెంటులో నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం విపక్షాల ఐక్యతకు నిదర్శనమని, దీనిని తమ విజయంగా భావిస్తున్నట్లు పార్టీ పేర్కొంది.

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను కాంగ్రెస్ మరోసారి తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలనే యథాతథంగా కొనసాగించాలని, మహిళా రిజర్వేషన్లను కూడా ఈ స్థానాల్లోనే అమలు చేయాలని స్పష్టం చేసింది. నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనకు తాము అంగీకరించబోమని ఈ సందర్భంగా తేల్చిచెప్పింది.

ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులు, యువత లక్ష్యంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాలకు విస్తరించాలని నిర్ణయించారు. వీటిలో పలు కీలక సమావేశాల్లో రాహుల్ గాంధీ స్వయంగా పాల్గొననున్నారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబాట్ల అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం పలు రంగాల్లో విఫలమైందని విమర్శించింది. సీడబ్ల్యూసీ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను పార్టీ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ మీడియాకు వివరించారు.

## బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

**ప్రతి రైతుకూ సకాలంలో రుణం అందాలి**

**రుణంతో పాటు రైతు ఆదాయమూ పెరగాలి**

**క్యూర్, ప్యూర్, రేర్ అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహాలు**

**ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగం కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం విజన్ డాక్యుమెంట్ కాదు.. తెలంగాణ ప్రజలతో మనకున్న అభివృద్ధి ఒప్పందం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే బ్యాంకింగ్ రంగం కూడా రూపాంతరం చెందాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

మిగతా 2 లో

## కబ్జా భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి

**ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం**

**పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు19 ప్రజాబలం:**పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.



బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.



రూ.61.76 కోట్లతో ప్రగతి పరుగులు..

పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ నెల 31లోగా పింఛన్ల దరఖాస్తు.

అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు , గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాబలం

20 ఆగస్ట్ 2026 గురువారం

## ఉరికి బదులు ఇంజెక్షన్...

భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై మరోసారి కీలక చర్చ తెరపైకి వచ్చింది. ఉరిశిక్షకు బదులుగా తక్కువ బాధాకరమైన, మరింత మానవీయమైన పద్ధతిని అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం, నిపుణుల పరిశీలన, న్యాయస్థానం ముందున్న రాజ్యాంగపరమైన ప్రశ్నలపై ఆధారపడనుంది.జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారిస్తోంది. న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న ఉరిశిక్ష విధానాన్ని సవాల్ చేశారు. ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం క్రూరమైన, అమానవీయమైన పద్ధతిగా మారే అవకాశం ఉందని ఆయన వాదించారు. మరణశిక్ష విధించిన వ్యక్తికి కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించే గౌరవంతో జీవించే హక్కు, దానికి అనుబంధంగా గౌరవప్రదమైన ప్రక్రియకు సంబంధించిన హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.పిటిషనర్ ప్రధానంగా ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ వంటి పద్ధతులను పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా కాల్చివేత, విద్యుదాఘాతం, గ్యాస్ ఛాంబర్ వంటి ఇతర పద్ధతులను కూడా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. అయితే ఏ పద్ధతి నిజంగా తక్కువ బాధాకరమైనది, మానవీయమైనది అనే విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదించారు.ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ పద్ధతుల అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టలేదు. గత విచారణల్లో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, మరణశిక్ష అమలు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. వైద్య, న్యాయ రంగాలకు చెందిన నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది.2026 జనవరి 22న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు వెంటనే తుది తీర్పు ఇవ్వకుండా ఆదేశాలను రిజర్వ్ చేసింది. పిటిషనర్, కేంద్ర ప్రభుత్వం తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు మూడు వారాల సమయం ఇచ్చింది.ఇదిలా ఉండగా, ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థలో మరణశిక్ష అమలు విధానం ఉరిశిక్షగానే కొనసాగుతోంది. పాత అతీఖఅలోని సెక్షన్ 354(5)కు సమానమైన నిబంధన ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 393(5)లో ఉంది. మరణశిక్ష విధించిన వ్యక్తిని ఉరి ద్వారా మరణించే వరకు శిక్ష అమలు చేయాలని ఈ నిబంధన పేర్కొంటుంది. ఉరిశిక్ష రాజ్యాంగబద్ధతపై గతంలోనూ సుప్రీంకోర్టు పరిశీలన జరిపింది. 1983లో 'దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం రాజ్యాంగబద్ధమేనని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పుడు పిటిషనర్ మాత్రం మారిన శాస్త్రీయ ప్రమాణాలు, మానవ హక్కుల దృక్పథం, గౌరవంతో కూడిన జీవితం అనే రాజ్యాంగ భావనల నేపథ్యంలో ఈ అంశాన్ని మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నారు.అయితే ప్రత్యామ్నాయ పద్ధతిని అమలు చేయడం అంత సులభమైన నిర్ణయం కాదు. ఏ విధానం తక్కువ బాధాకరమైనది? దాన్ని శాస్త్రీయంగా ఎలా నిర్ధారించాలి? వైద్య నిపుణుల పాత్ర ఎంతవరకు ఉండాలి? మరణశిక్ష విధించిన వ్యక్తికి అమలు పద్ధతిని ఎంచుకునే అవకాశం ఇవ్వాలా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం అవసరం. అందుకే ఈ కేసు కేవలం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయం గురించిన వివాదంగా కాకుండా, మరణశిక్షను ఒక రాష్ట్రం ఎలా అమలు చేయాలి? శిక్ష అమలులోనూ మానవ గౌరవానికి స్థానం ఉందా? అనే కీలక రాజ్యాంగ ప్రశ్నగా మారింది.ప్రస్తుతం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయ పద్ధతిని సుప్రీంకోర్టు అధికారికంగా ఆమోదించిందని చెప్పడం సరికాదు. కేంద్రం పరిశీలన, నిపుణుల అభిప్రాయాలు, పిటిషనర్ వాదనలు, రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ వ్యవహారంలో తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.ఉరి తీయడానికి బదులుగా ప్రాణాలు తీసేందుకు తక్కువ నొప్పిని కలిగించే ప్రత్యామ్నాయ పద్ధతులను అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దేశంలో ఉరిశిక్ష అమలు విధానం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది.ఉరితీయడం అనేది చాలా బాధాకరమైన, అమానవీయమైన పద్ధతి అని పిటిషనర్, న్యాయవాది రిషి మల్హోత్రా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉరిశిక్ష అమలు చేసిన తర్వాత మరణించినట్లు ప్రకటించే మొత్తం ప్రక్రియకు 40 నిమిషాలకు పైగా పడుతుందని, అదే ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం లేదా కాల్చి చంపడం లాంటి పద్ధతుల ద్వారా ఐదు నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తవుతుందని ఆయన వివరించారు భవిష్యత్తులో శాస్త్రీయ, వైద్యపరమైన బలమైన ఆధారాలు లభిస్తే ఈ అంశాన్ని మరోసారి పరిశీలించే అవకాశం ఉందని తెలిపింది. ఉరిశిక్ష అమలులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కావాలనుకుంటే ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది.దీనిపై కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి స్పందిస్తూ, ప్రత్యామ్నాయ పద్ధతులను పరిశీలించడానికి ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలిపారు. కాగా 2025 అక్టోబర్ 15న జరిగిన విచారణలో పాత పద్ధతిని మార్చడానికి కేంద్రం సుముఖంగా లేకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.దోషులకు ఉరి లేదా ఇంజెక్షన్ విధానాల్లో ఒకదాన్ని ఎంచుకునే ఆప్షన్ ఇవ్వాలన్న ప్రతిపాదన ఆచరణాత్మకంగా సాధ్యం కాదని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొంది. దీనిపై స్పందించిన కోర్టు, కాలంతో పాటు విషయాలు మారుతున్నాయని, పాత పద్ధతిని మార్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడమే అసలు సమస్య అని వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించి జనవరి 22నే విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తాజాగా తన తీర్పును వెలువరించింది.

# బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

### ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




మొదటి పేజీ తరువాయి

బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను ఎంతవరకు సాధించాయన్నదే కాకుండా, ఇచ్చిన రుణాలతో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయనే అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎంత ప్రైవేట్ పెట్టుబడి సమీకరించబడింది అన్నదే బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ, వ్యవసాయ రంగం పునాది అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు రుణాలు అవసరమయ్యే సమయంలోనే అందించాలని ఆయన చెప్పారు. అర్హత ఉన్న రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. రైతు రుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని అన్నారు. రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా, ఆ రుణాన్ని అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.

రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని అన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి ?52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమే అయినప్పటికీ, రుణాలు సకాలంలో అందడం ముఖ్యమని ఆయన గుర్తుచేశారు.

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా (MSME) రంగం కీలకమని అన్నారు. రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో డబ్బు చేతికి అందడం వ్యాపారులకు ముఖ్యమని చెప్పారు. దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన, కొలవదగిన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు. క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (CGTMSE) కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. CGTMSE కింద మంజూరు చేసే రుణాలకు పూచీకత్తు నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు.

తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క అన్నారు. క్యూర్ లో AI, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్ అవసరమని ఆయన తెలిపారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అవసరమన్నారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు అందించాలని భట్టి విక్రమార్క సూచించారు.

రాష్ట్రంలో జనధన్ ఖాతాలు భారీగా ఉన్నప్పటికీ దాదాపు 19.13 లక్షల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉందన్న విషయాన్ని గుర్తు ఆయన గుర్తు చేశారు. కేవలం ఖాతాలు తెరవడమే కాకుండా వారిని పొదుపు, బీమా, రుణాల దిశగా ప్రోత్సహించడమే నిజమైన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో నిష్క్రియాత్మకంగా ఉన్న బిజినెస్ కరస్పాండెంట్లను వెంటనే క్రియాశీలకం చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం బ్యాంక్ లింకేజీలకే పరిమితం చేయకుండా మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేలా 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సమయానికి అందేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇస్తూ, తెలంగాణ ప్రజల సమగ్ర వికాసానికి బ్యాంకింగ్ రంగం ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రైజింగ్ 2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్‌'ను రూపొందించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. వ్యవసాయ, ఉత్పాదకత ఆధారిత రుణాలు, మీవీజులు--స్టార్టప్ ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి ఆధారిత రుణాలు, గ్రీన్--క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్, జిల్లాల మధ్య క్రెడిట్ వ్యత్యాసాల నివారణ, దీర్ఘకాలిక మౌలిక వసతుల ఫైనాన్స్, కొత్త పరిశ్రమలు--సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలకు ఇందులో స్పష్టమైన వార్షిక లక్ష్యాలు ఉండాలని అన్నారు.

ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య, నాబార్డ్ సీజీఎం చిన్మయ్ కుమార్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, డీఎఫ్ఎస్ డైరెక్టర్ మానస గంగోత్రి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నేతలకు దక్కని చోటు..

## రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

### తెలంగాణ బీజేపీ నేతల మధ్య వర్గపోరు ఉందన్న రాజాసింగ్

### ఢిల్లీకి వెళ్లి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శ

### తెలంగాణ నేతలు మారరనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చి ఉంటుందని వ్యాఖ్య



బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు ప్రాతినిధ్యం దక్కకపోవడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగుతున్న వర్గ రాజకీయాలే దీనికి ప్రధాన కారణమని ఆరోపిస్తూ, రాష్ట్ర నేతలంతా తమ వైఖరిపై ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు.

గతంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నేతలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కేవని, కానీ ఈసారి ఒక్కరికి కూడా జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేదని రాజా సింగ్ అన్నారు. తెలంగాణ బీజేపీలో నిరంతరం గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయని, ప్రతి చిన్న విషయానికీ ఢిల్లీకి వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శించారు. నాయకుల మధ్య ఉన్న ఈ తీవ్ర విభేదాల వల్లే 'తెలంగాణ నేతలు మారరు' అనే ముగింపునకు అధిష్ఠానం వచ్చి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు.

అలాగే, దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో ప్రత్యేక ప్రణాళికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నేతలంతా పాత విభేదాలను, స్వయం ప్రయోజనాలను పక్కనబెట్టి, పశ్చిమ బెంగాల్ తరహాలో ఐక్యంగా పోరాడి తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పోరాడితేనే భవిష్యత్తులో పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపునిచ్చి, పదవులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

### భారీ చిత్రాలకు కొత్త రూల్..

### తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 19భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## హైదర్నగర్ ముస్లిం మైనారిటీ, హిందువులకు సర్వేనెంబర్ 65 కమ్యూనిటీ హాల్ కోసం 1000గజాలస్థలాని కేటాయించండి: ఎండి కలీంభాయ్



**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి) ఆగస్ట్19**గత మూడు సంవత్సరాల క్రితం శేరిలింగంపల్లి స్థానిక శాసనస భ్యులు పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ హైదర్ నగర్ సర్వే నెంబర్ 65 లో ఉన్న స్థలం వివాదాస్పదం గా ఉందని అది ఎవరికి కూడా ఇవ్వకూడదని గ్రామం నుండి ముస్లిం మైనారిటీ సోదరులు కమ్యూనిటీ హాల్ కోసం తలం కేటాయించాలని కోరగా ఇలా చెప్పారని టిఆర్ఎస్ నాయకులు బుధవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో తెలియజేశా రు. కాగా అప్పట్లో ఎట్టి పరిస్థితు ల్లో కూడా ముస్లిం మైనారిటీ సోదరులకు కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ కోసం సర్వే నెంబర్ 72 నుండి తాను ఇవ్వడానికి సిద్ధమే నని అతను మాకు హామీ ఇచ్చిన ట్లు ఆయన పేర్కొన్నారు.శేరిలిం గంపల్లి నియోజకవర్గంలో ఎమ్మె ల్యే గాంధీ సార్ కి ఎంతో మంచి పేరు ఉన్నప్పటికీ గత ఆదివారం

సర్వేనెంబర్ 65 లో 3,454 చదరపు గజాల భూమి వేలం వేయడానికి సిద్ధమయ్యారని ఈ విషయంలో మిత్ర హిల్స్ కు చెందిన విద్యార్థులు చేతిలో ప్లే కార్డ్ పట్టుకొని ఈ స్థలం అమ్మ కూడదని ఈ స్థలం పార్క్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేయడం టిఆర్ఎస్ పార్టీ నుండి ధర్నా చేయడం జరిగిందన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం ఆలోచించే మీరు ఎవరు ఎన్ని చెప్పినా స్థలం అమ్మే విషయంలో మీరు రావడం ఏమాత్రం బాగాలేదని తెలియజేశా రు. ఇప్పుడు ఏ భూమి అయితే వేలం వేయడానికి సిద్ధమయ్యారు అదే స్థలాన్ని గతంలో ప్రస్తుత కూకట్పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అప్పట్లో వైస్ చైర్మన్ ఉన్నప్పుడు దీని ప్రభుత్వ స్థలంగా గుర్తించిన విషయం పాఠకులకు విదితమేనని ఆయన తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే పుట్టి ఇక్కడే పెద్దవాలమై మా పిల్లలు కూడా చిన్న చిన్న గల్లీలలో పార్కులు లేక ఫంక్షనాలు లేక బందిఖానాలో బంది ఉన్నట్లుగా జీవనం కొనసాగిస్తుంటే... మీరు వేలం వేసే విషయంలో ఏమాత్రం ముందుకెళ్లరాదని మరొక్కసారి ఆలోచించి మాకు న్యాయం చేయాలంటే ముస్లిం మైనారిటీ సోదరులకు వేయి గజాల భూమి ఫంక్షన్ హాల్ కోసం, హిందువులకు వేయ గజాల స్థలం ఇవ్వగా, మిగి లిన స్థలాన్ని పార్కు కేటా యించి మాకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. మేము పెళ్లిళ్ల ఫంక్షన్ బర్త్ డేలు చేసుకోవాలంటే పక్కన ఉన్న రామ్ నరేష్ నగర్ లేదా నందమూరి నగర్ వెళ్లి వాలు చెప్పే చార్జీలు కనీసం 20000 ఒక్కరోజు అని చెప్తా ఉన్నారు. మీరు ఇచ్చిన మాట ప్రకారం మాకు ఈ రెండు వర్గాల వారికి తప్పనిసరిగా న్యాయం చేస్తారని ఎదురుచూస్తూ, మరొక్కసారి విజ్ఞప్తి చేసుకుంటు న్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో టిఆర్ఎస్ సీనియర్ నాయ కులు ఎండి ఖదీర్, ఎండి సమీర్ (పప్పు) సిరాజ్ దస్తగీర్ ఆమేర్ ఆశు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం

### బి.సి ల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది
### 2028 ఎన్నికల్లో అధికారమే ఆధార్ పార్టీ ప్రధాన లక్ష్యం
### ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడ శేషగిరిరావు

బహుజనులు రాజకీయ కూలీలు కాదని, ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం జరుగుతుందని, బి.సి ల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాదని ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సుప్రీంకోర్టు న్యాయవాది డా. ఈడ శేషగిరిరావు అన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రం నేచర్ 369 హోటల్ నందు అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఆధార్) పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలను అందలం ఎక్కించాలనే ముఖ్య ఉద్దేశంతో రాజకీయ మనుగడ సాగిస్తున్న ఆధార్ పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు.వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన తో పాటు మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేయాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. బీసీ వర్గాలకు వారి జనాభా నిష్పత్తి కి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 2028లో అధికారమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఆసక్తి కలిగిన యువతకు ఆధార్ పార్టీలో అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో ఆధార్ పార్టీ పోటీ చేసే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఆధార్ పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.



ఈ కార్యక్రమంలో ఆధార్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గట్ల యుగేందర్ గౌడ్, ఆదార్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, ఎస్సి సెల్ చైర్మన్ ఆంబోజు బుడ్డయ్య, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బండా రాజారాం, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మధు, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు నీరటి సత్యం, నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షులు జెట్టి శ్రీనివాస్, పరకాల అసెంబ్లీ మల్లేష్, కొత్తగూడెం ఇంచార్జి ప్రేమ్ దయిల్, ఖమ్మం ఇంచార్జ్ బూర సైదరావు, ఖమ్మం పట్టణ అధ్యక్షులు నక్క అజయ్ పద్మశాలి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గంగుల రాజేందర్ ప్రసాద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మధు వర్మ నాయక్, రాష్ట్ర నాయకులు తల్లాడ వెంకన్న, మంద హరినాథ్ బాబు, ఖమ్మం జిల్లా నాయకులు సునీల్, నాగరాజు, మొగిలయ్య, రవీంద్ర, శ్రీకాంత్, వరంగల్ జిల్లా నాయకులు అఖిల్, శ్రవణ్, సాగర్, రంజిత్, రాకేష్, శ్యామ్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బి.సి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్, మొగిలయ్య ఫౌండేషన్ కార్యదర్శి కూనూరు రంజిత్ గౌడ్, బి.సి సంఘాల నాయకులు మార్క రవి గౌడ్, కంకేటి సాగర్, కూనూరు రాకేశ్, కామగోని శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది నిరంజన్ రెడ్డికి ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శ



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజాబలం:** ఇటీవల అస్వస్థతకు గురైన ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్ రెడ్డిని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం బుర్హాన్ పురంలోని నిరంజన్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొర్లగూడెం పిఏసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, వైరా అయ్యప్ప దేవస్థానం చైర్మన్ వెంకటకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మూడు వెంకన్న, రాజ్య తండా సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పార్కులు ఎవరికోసం

### . ప్రజల వినోదం కోసమా..
### . జంతువుల విహారానికా..
### . ఆకతాయిల అడ్డాలకా..
### .కలెక్టర్ ఆదేశాలకే లెక్కలేదా?

**రాజన్న సిరిసిల్ల జిల్లా,ఆగస్టు 19 ( ప్రజాబలం ప్రతినిధి )**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు పార్కుతో పాటు పట్టణంలోని పలు పార్కుల దుస్థితి చూస్తే, అసలు ఇవి ప్రజల వినోదం కోసం కట్టారా లేక జంతువుల విహారానికా, ఆకతాయిల అడ్డాలకు వదిలేశారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రోజంతా మగ్గాల చప్పుళ్ల మధ్య శ్రమించి,సాయంత్రం వేళల్లో మానసిక ప్రశాంతత కోసం కుటుంబాలతో వచ్చే చేనేత కార్మికులకు, స్థానికులకు ఇక్కడ






భయాందోళనలే మిగులుతున్నాయి.పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేసిన డబ్బులు లక్షల్లో వెచ్చించి నిర్మించిన పార్కులు అధికారుల బాధ్యతారాహిత్యానికి, పాలకుల అలసత్వానికి సజీవ సాక్ష్యాలుగా మారుతున్నాయి. పార్కును పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దడం, పర్యవేక్షణ చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.పార్కు లోపలికి అడుగుపెడదామంటే ఉదయం నుంచే వానరాల గుంపులు దాడికి దిగుతున్నాయి. వాకర్లు, వృద్ధులు, చిన్నపిల్లలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది.చీకటి పడితే ఆకతాయిల సామ్రాజ్యం సరైన విద్యుత్ దీపాలు లేకపోవడంతో సాయంత్రం కాగానే పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబుల తాగుడు స్థావరాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

కలెక్టర్ ఆదేశాలకూ లెక్కలేదా? అధికారుల నిర్లక్ష్యానికి అంతే లేదా?

స్వయంగా జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో కొత్త చెరువును పర్యటించి.. పార్కుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని చెడిపోయి ఉన్న ట్రైన్ రిపేర్ చేపించాలని ఆదేశాలు జారీ చేసినా స్థానిక అధికారులు కనీసం చీమ కుట్టినట్లయినా స్పందించకపోవడం వారి నిర్లక్ష్యపు పరాకాష్టకు నిదర్శనం. ఉన్నతాధికారుల ఆదేశాలకే విలువ లేకపోతే ఇక సామాన్య ప్రజల మొర ఎవరు వింటారు? అధికారులు ఇకనైనా నిద్ర వీడి, పార్కుల్లో కోతుల, బెడదను నివారించి, లైట్లు, సెక్యూరిటీ ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని..ఈ దుస్థితికి కారణమైన సంబంధిత మున్సిపల్, అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేసి కోతులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కొత్త చెరువు పార్కుకు పూర్వ వైభవం తెచ్చి ప్రజలకు భద్రత కల్పించాలని సిరిసిల్ల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి మంజూరుకు కృషి చేసిన ఎంపీ రఘురాం రెడ్డి.

### కృతజ్ఞతలు తెలిపిన కైకొండాయిగూడెం కాంగ్రెస్ నాయకులు.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజాబలం:**నగరంలోని విజయనగర్ కాలనీ మార్గంలో నాగార్జునసాగర్ కాల్వపై..రూ.3.47 కోట్లతో బ్రిడ్జి మంజూరు చేయించిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డిని వారి నివాసంలో కైకొండాయిగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిసి.. కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒకటో డివిజన్ కార్యదర్శి శీలం వీరబాబు, అధ్యక్షులు పందుల తిరుపతిరావు, నాయకులు నాగటి ఉపేందర్, పార్టీ ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, భూక్యా ఉపేందర్, కార్యదర్శి భూక్య గోపి.. ఎంపీని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.



కైకొండాయిగూడెం, దానవాయిగూడెం వెళ్లేందుకు, అలాగే రామన్నపేట మీదుగా డోర్నకల్ మార్గం చేరుకునేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఎంపీ.. పలుమార్లు రాష్ట్రమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారని, అలాగే గతంలో జలసౌద సమీక్ష సమావేశంలో విన్నవించగా.. ఈ వంతెన మంజూరయిందని, ఈ ప్రాంత ప్రజలు ఎంపీని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# నగరిలో దారుణం..

### ఇన్నోవా డ్రైవర్ని కంటైనర్ నడిపించి దారుణ హత్య

నగరి లో దారుణం జరిగింది. ఇన్నోవా కారును కంటైనర్ ఢీకొట్టి ఆపకుండా వెళ్లింది. మంగళవారం రాత్రి నగరి సమీపంలో ఘటన జరిగింది. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరి రూరల్ వీకేఆర్ పురం వద్ద కంటైనర్ను అడ్డుకుని డ్రైవర్ను నారాయణ(36) ప్రశ్నించారు. కంటైనర్లోకి ఎక్కే ప్రయత్నంలో కిందపడిన నారాయణ.. ఆయనపై నుంచి కంటైనర్ వెళ్లడంతో డ్రైవర్ మృతి చెందాడు. మృతుడు తిరుపతి మారుతీనగర్కు చెందిన నారాయణగా గుర్తించారు. నగరి సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మహారాష్ట్రకు చెందిన కంటైనర్గా గుర్తించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# 22/ఏ సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

# ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి

### ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి

### అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

### మాభూమి మాకు దక్కింది ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు -22 ఏ దరఖాస్తుదారులు



హైదరాబాద్ :- 22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు.

అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22/ఏభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**"నా భూమి నాకు దక్కిం ది.. -ప్రభుత్వానికి కృతజ్ఞతలు"**



22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన పోచారం గ్రామానికి చెందిన రాకేష్ తన అనుభవాన్ని వెల్లడించారు.

"నేను 2022లో పోచారం గ్రామంలో వంద గజాల స్థలం కొనుగోలు చేశాను. ఇటీవల ఆ స్థలాన్ని విక్రయించేందుకు నార్లపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. మొదట డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించగా, మీ భూమి22/ఎ లో ఉందని చెప్పారు. దీంతో కొంత ఆందోళనకు గురయ్యాను. అయితే మూడు, నాలుగు రోజుల క్రితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి మీ భూమికి ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ఈ రోజు నేను ఆ స్థలాన్ని కొనుగోలుదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేశాను. నా భూమి నాకు దక్కేలా సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు" అని తెలిపారు.

" క్లియరెన్స్ వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం"


నారపల్లి సబ్ రిజిస్ట్రార్ సునీల్ మాట్లాడుతూ.. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 50ను ఏపీ హౌసింగ్ బోర్డు భూమిగా పేర్కొంటూ గత ఏడాది డిసెంబర్‌లో22/ఎ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల కలెక్టర్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. వెంటనే గతంలో రిజిస్ట్రేషన్ కోసం మమ్మల్ని సంప్రదించిన వారికి ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నాం. వారు కార్యాలయానికి వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం" అని సబ్ రిజిస్ట్రార్ సునీల్ తెలిపారు.

**మా సొసైటీలోని 300 ప్లాట్లకు పూర్తి విముక్తి కలిగింది- చక్రపాణి (కొనుగోలుదారు)**



కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని నెంబర్ 80సిలోగల 250 గజాల స్థలాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు చేశాను. అయితే రిజిస్ట్రేషన్ కోసం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఆభూమి 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ చేయలేదు. తాజాగా ప్రభుత్వ చర్యల కారణంగా నిన్ననే నాకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ఈ రోజు వెళ్లగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అంతేగాక మా సొసైటీలోని 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు చెప్పారు. మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు- అని చక్రపాణి అనే కొనుగోలుదారు తెలిపారు.

**ప్రభుత్వ సకాల చర్యల వల్ల రిజిస్ట్రేషన్ పూర్తయింది- రాజేంద్రప్రసాద్**



బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల రెయిన్‌బో విస్టాలో ఉన్నప్లాట్ నెంబర్ 804 ను విక్రయించేందుకు కొద్దికాలం క్రితం యజమాని వెంకట విజయ్‌కుమార్ ప్రయత్నించారు. అయితే 22ఎ నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్ జరగలేదు. వెంకట విజయ్‌కుమార్ ఆస్ట్రేలియా వెళ్లిపోతూ తన మామ రాజేంద్రప్రసాద్‌కు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. ఈనెల 12న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో ఈరోజు రాజేంద్రప్రసాద్ వెళ్లి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ ఏమన్నారంటే...

మా అల్లుడు సేల్ చేద్దామనుకున్న ఫ్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వస్తే... 22ఎ కింద గవర్నమెంట్ నిషేధం విధించిందని చెప్పినందున ఆ రోజు రిజిస్ట్రేషన్ అవ్వలేదు. ఆ తర్వాత నా అల్లుడు నా పేరు మీద స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. అది ఇంకా చాలా కాలమే పడుతుందేమో అనుకున్నాం గానీ... అదృష్టవశాత్తూ ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకున్నందున వెంటనే ఒక వారం రోజుల్లోనే ఇది క్లియర్ అయ్యి... అనుకూలంగా తేలింది. ఈ రోజు రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం, రిజిస్ట్రేషన్ కూడా మాకు సంతృప్తి కరంగా పూర్తిగా అవుతుంది. ప్రభుత్వానికి చాలా కృతజ్ఞతలు. -

**ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి - శ్రీనివాస్**



బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల వైష్ణవి ఎస్టేట్ ప్రతినిధి శ్రీనివాస్ మూసాపేట సర్వే నెంబర్ 108లోగల భూమిని విక్రయించేందుకు రాగా 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తిరస్కరించారు. తాజాగా ప్రభుత్వ చర్యలు కారణంగా ఈరోజు శ్రీనివాస్ తన భూమికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..

మాకు 2005 లో సీలింగ్ పర్మిషన్ వచ్చింది. మేము రిజిస్ట్రేషన్ కి అప్పటినుంచి ప్రయత్నం చేస్తున్నాము. . తాజాగా రెండు వారాల క్రితం మూసాపేట్ బాలానగర్ ఆఫీస్ లో రిజిస్ట్రేషన్ కి వెళ్తే 22ఎ లో పెట్టామని చెప్పారు. మేము కలెక్టర్ గారిని అప్రోచ్ అయ్యాము. ఆ తర్వాత ఈ రోజు మళ్ళీ అది క్లియర్ చేశారు. దాంతో ఈ రోజు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ కంప్లీట్ చేశాము. ప్లాట్ కూడా రిజిస్ట్రేషన్ అయింది. థాంక్యూ వెరీ మచ్.

పలు సర్వే నెంబర్లలో నిషేధం తొలగింపు – ఎస్.ఆర్.వో

బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గల సర్వే నెంబర్లు 101/1, 101/2, 102, 108, 109, 112, 81 లో ఉన్న సుమారు 3000 చదరపు మీటర్ల స్థలంపై ఉన్న 22ఎ నిషేధం తొలగిపోయింది. ఈ సర్వే నెంబర్లలో ఉన్న భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుపుకోవచ్చునని బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

అధికారుల ఆదేశాలతో వెంటనే రిజిస్ట్రేషన్

మేము ఏజీ కాలనీ, గుండ్ల పోచంపల్లిలోని .గౌరీశంకర్ వద్ద మేము ఒక ప్లాట్ తీసుకోవడం జరిగింది.

మేము జూలై ఆరు నాడు ఇక్కడ రిజిస్ట్రేషన్ కి రాగా 22ఎ నిషేధిత జాబితా పేరిట రిజిస్ట్రేషన్ ఆగిపోయింది.

అప్పటినుంచి మేము కలెక్టర్ ఆఫీస్ కి, అక్కడ ఇక్కడ తిరుగుతుంటే... ఈరోజు డిప్యూటీ కలెక్టర్ గారు వచ్చి, క్లియర్ చేయమని సబ్-రిజిస్ట్రార్ గారికి చెప్పారు. ఆ వెంటనే సబ్ రిజిస్ట్రార్ మేడమ్ మాకు ఫోన్ చేసి, రిజిస్ట్రేషన్ పూర్తి చేసి మాకు ఈ డాక్యుమెంట్స్ ఇవ్వడం జరిగింది అని ఒక దరఖాస్తుదారు తెలిపారు.

# విరాహత్ అలీని పరామర్శించిన ప్రముఖులు

### మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం మృతికి సంతాపం

### మీడియా అకాడమీ చైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, జర్నలిస్టుల పరామర్శ





గజ్వేల్, ఆగస్టు 19 తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, మీడియా రంగ ప్రముఖులు, జర్నలిస్టు సంఘాల నాయకులు గజ్వేల్‌లోని విరాహత్ అలీ నివాసానికి చేరుకుని బాషారత్ ఉన్నిసా బేగం భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం విరాహత్ అలీ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రముఖుల పరామర్శ

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఐజేయూ జాతీయ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు నందిని సిధారెడ్డి, దేవి ప్రసాద్, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు విరాహత్ అలీని పరామర్శించారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్, ఐజేయూ నాయకులు మాజీద్, నరేందర్‌రెడ్డి, జర్నలిస్టు సంఘం రాష్ట్ర నాయకులు రాజేష్, మోతే వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, మధుగౌడ్, గాడిపల్లి మధు, దొంతు రమేశ్, సీనియర్ జర్నలిస్టులు ఫైసల్ అహ్మద్, రంగాచారి తదితరులు విరాహత్ అలీ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

చిన్న పత్రికల సంఘం నేతల సానుభూతి

తెలంగాణ చిన్న, మధ్యతరహా పత్రికలు, మ్యాగజైన్ల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు అల్వాల హన్మంత్, కూతురు రాజిరెడ్డి, మాతంగి దాస్, అగస్టిన్, రవి, శ్రీనివాస్, యాదయ్య, అలీ, మక్సూద్, సుధాకర్, రవికుమార్,అల్వాల మనోజ్ తదితరులు విరాహత్ అలీని, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జర్నలిస్టు సంఘాల నాయకుల హాజరు

ఉమ్మడి మెదక్ జిల్లా జర్నలిస్టు సంఘం నాయకులు యాదగిరి, శంకర్ దయాల్ చారి, డీజే శర్మతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిగాశంకర్, బాలరాజ్ గౌడ్, రజనీకాంత్, గాండ్ల శ్రీనివాస్, దేశపాక స్వామి, హరి, అనిల్, గౌస్, నాగరాజు, ఏ. రవీందర్, చెరుకుపల్లి శ్రీనివాస్, వేణు, వెంకటేశ్వర్లు, కర్ణయ్య, రవికుమార్, స్వామి తదితరులు విరాహత్ అలీని పరామర్శించారు.

గజ్వేల్ ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల సంతాపం

గజ్వేల్ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు సురేందర్, ఎల్లారెడ్డి, విజయానందరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి తదితరులు విరాహత్ అలీని కలిసి సంతాపం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన, మాజీ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, పలువురు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు కూడా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలకు హాజరైన పలువురు

బాషారత్ ఉన్నిసా బేగం అంత్యక్రియలు బుధవారం సాయంత్రం నిర్వహించారు. అంత్యక్రియల్లో పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు, స్థానిక నాయకులు పాల్గొని ఆమెకు తుది నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# భోగాపురంలో బాదుడే...బాదుడు

విజయనగరం, ఆగస్టు 19, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. నిన్నటి నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభం కాగా.. తొలిరోజు 26 విమాన సర్వీసులు నడిచాయి. అయితే తొలి రోజు ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. విశాఖ నగరం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ప్రతి రెండు గంటలకు ఒకసారి బస్సులు నడిచినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. పైగా భోగాపురంలో ఆర్టీసీ బస్సులను ఆపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయలేదు. ఇంకోవైపు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చార్జీల బాదుడు అధికంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమర్షియల్ వెహికల్ ఎంట్రీ, వెయిటింగ్ పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తుండడం వివాదాలకు దారితీస్తోంది. ఒక డ్రైవర్ విమానాశ్రయం సిబ్బందిని నిలదీస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులను తీసుకొచ్చాడు ఓ క్యాబ్ డ్రైవర్. అయితే ఆ డ్రైవర్ నుంచి సిబ్బంది ఏకంగా 600 రూపాయల కమర్షియల్ టాక్స్, వెయిటింగ్ ఛార్జ్ డిమాండ్ చేయడంతో డ్రైవర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రయాణికులను విమానాశ్రయంలో దింపేందుకు 700 రూపాయలు తీసుకున్నానని.. కానీ విమానాశ్రయం లోపలికి ప్రవేశించగానే 600 రూపాయలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇది ఎంత మాత్రం న్యాయం కాదని.. నిబంధనల పేరుతో క్యాబ్ డ్రైవర్లను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో విపరీతంగా ట్రోల్ అవుతోంది. వాస ్తవానికి విమానాశ్రయం డిస్ప్లే బోర్డు పై పొందుపరిచిన పార్కింగ్, వెయిటింగ్ ఫీజుల ను మాత్రమే తీసుకోవాలి. అయితే ఈ డిస్ప్లే లో సైతం భారీగా చార్జీలు కనిపిస్తు న్నా యి. అయితే తాము చెప్పినట్టుగా 600 రూపా యలు ఇవ్వాల్సిందేనని ఎయిర్పోర్ట్ సిబ్బంది డిమాండ్ చేయగా.. సదరు డ్రైవర్ మాత్రం ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనకు న్యాయం జరిగే వరకు కారును ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. ఉన్నతాది కారుల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలం టూ పట్టుపట్టాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గట్టి వాదన జరిగింది. పక్కనున్న వారు ఈ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విపరీతంగా వైరల్ అయింది.

# తమిళ రాజకీయాల్లో సెల్యూట్ ఫీవర్

చెన్నై. ఆగస్టు 19 తమిళనాడు పాలిటిక్స్‌లో పర్సనల్ టార్గెట్స్ సీజన్ నడుస్తోందిప్పుడు. సరిహద్దులు దాటిన రాజకీయ కక్ష్య.. దారి తప్పి వ్యక్తిగత విమర్శల వైపు తిరుగుతోంది. మొన్న విజయ్‌ను టార్గెట్ చేస్తూ బీజేపీ స్టేట్ చీఫ్ నైనార్ నాగేంద్రన్ చేసిన 'అయ్యా.. అమ్మ' వ్యాఖ్యల వివాదం మరువకముందే.. ఇప్పుడు విజయ్-త్రిష సెల్యూట్‌పై డీఎంకే విమర్శలు గుప్పిస్తోంది. మొత్తానికి.. తంబీల రాజకీయం మరీ వ్యక్తిగత విమర్శలవైపు వెళు _న్నాయి. కోలీవుడ్‌లో ఆ ఇద్దరి కాంబినేషన్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కానీ, ఈసారి సీన్ మారింది. వేదిక సినిమా థియేటర్ కాదు.. చెన్నైలోని చారిత్రాత్మక సెయింట్ జార్జ్ కోట. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి సీఎం హోదాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే, ఈ అధికారిక వేడుకల్లో అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం ముందు వరుసలో కూర్చున్న త్రిష కృష్ణన్. పసుపు రంగు చీరలో మెరిసిపోతూ.. వీఐపీ గ్యాలరీలోని ఫ్రంట్ రోలో.. విజయ్ తల్లిదండ్రుల పక్కనే కూర్చుని ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా కనిపించారు త్రిష. సీఎం విజయ్ జాతీయ జెండాను ఎగురవేసిన సమయంలోనూ ఎంతో గౌరవంతో సెల్యూట్ చేశారు. అది కామన్. ఎవరైనా చేసేదే. బట్.. ఆ తర్వాత అధికారిక కార్యక్రమాలను విజయ్ పరిశీలిస్తున్న సమయంలోనూ ఆమె సెల్యూట్ చేస్తూ మొబైల్‌లో ఫొటోలు తీస్తూ కనిపించారు. ఇక పరేడ్ ముగించుకుని సీఎం విజయ్ ముందుకు సాగుతున్న తరుణంలో.. అక్కడ ఉన్న త్రిషకు సెల్యూట్ చేశారు. దానికి అంతే గౌరవంతో త్రిష కూడా సీఎం విజయ్‌కు నవ్వుతూ సెల్యూట్ చేశారు. అంతే.. ఈ ఒక్క క్లాప్ మూడు రోజులుగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో తెగ వైరల్ అవుతోంది. దళపతి ఫ్యాన్స్ ఈ మూమెంట్‌ను ట్రెండ్ చేస్తుంటే.. రాజకీయ వర్గాల్లో మాత్రం ఇది తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం డీఎంకే పత్రిక మురసోలి తీవ్ర విమర్శలు గుప్పించింది. అసలు ఏ అర్హత ఉందని, ఏం హోదా ఉందని త్రిషను ముందు వరుసలో కూర్చోబెట్టారని నిలదీసింది. మురసోలి తన సంపాదకీయంలో ఈ ఘటనను ఒక సిగ్గుచేటు దృశ్యంగా అభివర్ణించింది. ఒక ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఇలాంటి వ్యవహారం అసలేమాత్రం సముచితం కాదని మండిపడింది. నిజానికి ఈమధ్య కాలంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో త్రిష హాజరు కావడం పెద్ద చర్చనీయాంశంగా మారుతోంది. మే నెలలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి కూడా ఆమె హాజరయ్యారు. ఆ వేడుక జరుగుతుండగా త్రిష తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న వీడియో కూడా అప్పట్లో వైరల్ అయింది. విజయ్, త్రిష చాలా ఏళ్లుగా అత్యంత ఆప్తమిత్రులుగా ఉంటున్నారు. వీరిద్దరి సాన్నిహిత్యంపై తరచూ సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో ఎన్నో ఊహాగానాలు, ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మురసోలి పత్రిక సైతం విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రచారాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శల డోస్ పెంచింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముఖ్యమంత్రి విజయ్ హోదాకు ఉండాల్సిన గౌరవం గాలిలో కలిసిపోయిందని గట్టిగా విమర్శించింది. ఎలాంటి సంకోచం లేకుండా ఓ నటిని ముందు వరుసలో కూర్చోబెట్టి.. పదేపదే పరస్పరం సెల్యూట్ చేసుకోవడం ఏంటని ప్రశ్నించింది. విజయ్‌కు ఓటు వేసిన వారే ఈ దృశ్యాన్ని జీర్ణించుకోలేకపోయి ఉంటారంటూ మురసోలి చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు తమిళ పాలిటిక్స్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో కోటి ఓట్లు మిస్సింగ్

హైదరాబాద్, ఆగస్టు 19, కేంద్ర ఎన్నికల సంఘం తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో చేపట్టిన సమగ్ర ప్రక్షాళన ప్రక్రియ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రెండు రాష్ట్రాల్లో కలిపి సాంకేతికంగా కోటి ఇరవై లక్షలకు పైగా ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతున్నాయి. జాబితా నుంచి తొలగింపునకు గురవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే అయినప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయకపోవడం, సైలెంట్‌గా ఉండటం వెనుక ఏం జరుగుతోంది? వాస్తవానికి ఈ గల్లంతు ప్రక్రియ అంతా అర్హులైన ఓటర్లను తొలగించడం కాదని, ఓటర్ల జాబితాను క్లీన్ క్రమంలో జరుగుతున్న సాంకేతిక ప్రక్రియ అని పార్టీలకు స్పష్టమైన అవగాహన ఉంది. ఉమ్మడి రాష్ట్ర విడిపోయాక , హైదరాబాద్ కేంద్రంగా స్థ స్థిరపడిన లక్షలాది మందికి ఏపీ, తెలంగాణ రెండింటిలోనూ ఓట్లు ఉన్నాయి. దీనికి తోడు మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, ఆధార్‌తో ఎపిక్ సీడింగ్ జరగడం వల్ల ఈ డూప్లికేట్ , ఇన్-యాక్టివ్ ఓట్లను ఈసీ వ్యవస్థ పసిగట్టి తొలగిస్తోంది. ఇది ఓటు హక్కును కాలరాయడం కాదని తెలిసే ప్రధాన పార్టీలు దీనిపై వీధిపోరాటాలకు దిగడం లేదు. అయితే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని ఈసీ వద్ద తరచూ ఫిర్యాదులు చేస్తోంది. దీని వెనుక కాంగ్రెస్ పార్టీకి బలమైన రాజకీయ సమీకరణాలు ఉన్నాయి. గడిచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, పట్టణ ప్రాంతాల్లో ఉన్న బోగస్, డబుల్ ఓట్లు ఫలితాలను ప్రభావితం చేశాయని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఇతర పట్టణాల్లోనూ క్రమబద్ధీకరణ జరిగితే క్లీన్ ఓటర్ లిస్ట్ వల్ల తమకే పొలిటికల్ అడ్వాంటేజ్ ఉంటుందని కాంగ్రెస్ లెక్కిస్తోంది. అందుకే ప్రతి బూత్ స్థాయిలో తమ బూత్ లెవల్ ఏజెంట్లను అలర్ట్ చేస్తూ, తొలగింపులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్, వైసీపీ, టీడీపీ-జనసేన కూటమి సైలెంట్‌గా ఉండటానికి కారణం.. క్షేత్రస్థాయి రియాలిటీయే. ఆయా పార్టీల అంతర్గత సర్వేల ప్రకారం, తొలగింపునకు గురవుతున్న ఓట్లలో అత్యధికం నివాసాలు మారిన వారివి, లేదా డబుల్ ఓటింగ్‌కు అవకాశం ఉన్నవే. ఒకవేళ పొరపాటున నిజమైన ఓటరు పేరు తొలిగినా, వారిని మళ్లీ ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేయించి ఓటరుగా నమోదు చేయించవచ్చనే సాంకేతిక వెసులుబాటు ఈసీ కల్పిస్తోంది. రచ్చ చేయడం కంటే క్షేత్రస్థాయిలో బిఎల్ఓ ల వద్ద తమ ఏజెంట్ల ద్వారా ఓట్ల పునరుద్ధరణ చేయించుకోవడమే ఉత్తమ మార్గమని పార్టీల భావన. వాస్తవానికి ఎన్నికల సంఘం పారదర్శకంగా ఫారమ్-7 దరఖాస్తులు, క్లెయిమ్స్ , అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను నిర్వహిస్తుండటంతో చట్టపరంగా దీన్ని ప్రశ్నించే అవకాశం తక్కువగా ఉంది. కోటి ఇరవై లక్షల ఓట్ల ప్రక్షాళన అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే క్రమంలో జరుగుతున్న ఒక ప్రక్షాళన. నిరసనలు, ఆందోళనల కంటే నిశ్శబ్దంగా బూత్ స్థాయిలో తమ మద్దతుదారుల ఓట్లు జాబితాలో ఉండేలా చూసుకోవడమే రాజకీంగా ప్రయోజనకరమని భావించి పార్టీలు వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నాయి. తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అధికారికంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 2.64 కోట్లకు పైగా మంది ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించగా, వీరి పేర్లను ముసాయిదా జాబితాలో చేర్చారు. క్షేత్రస్థాయిలో డోర్-టు-డోర్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ ముసాయిదా వివరాలను వెల్లడించారుమరోవైపు, ఎన్యుమరేషన్ సర్వే సమయంలో దాదాపు 73.39 లక్షల అంటే 21.7 శాతం ఎంట్రీలు అన్‌కలెక్టబుల్ కేటగిరీ కింద నమోదై ముసాయిదా జాబితా నుంచి తాత్కాలికంగా తొలగింపునకు గురయ్యాయి. వీటిలో శాశ్వతంగా నివాసాలు మారిన వారు , డబుల్ ఎంట్రీలు , మరణించిన వ్యక్తుల వివరాలు ఉన్నట్లు సీఈవో ప్రకటించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఈ తరహా వలస , అన్‌ట్రేసబుల్ ఓటర్ల సంఖ్య భారీగా నమోదైంది. ఓటర్ల సంఖ్య , నివాస ప్రాంతాల మార్పుల ఆధారంగా ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల సంఖ్య 36,353కి పెరిగింది. ఓటర్లు తమ నివాసాలకు సమీపంలో సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, రద్దీని నివారించేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల పరిమితిని క్రమబద్ధీకరించారు. ముసాయిదా జాబితాలో పేర్లు లేని లేదా తప్పులు దొర్లిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పిస్తూ అభ్యంతరాలు, చేర్పుల గడువును అధికారులు ప్రకటించారు. దీని ప్రకారం సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుంది. ఓటర్లు తమ స్థితిని సరిచూసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని, అనంతరం అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# కమలం... కొత్త వ్యూహం..

హైదరాబాద్, ఆగస్టు 19, తెలంగాణలో 2028 ఎన్నికల్లో అధికారం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో బీజేపీ అధిష్టానం కీలక వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీ బలోపేతం, సంస్థాగత పునర్నిర్మాణం, నాయకత్వ సర్దుబాట్లు ఇవన్నీ ఒకే దిశలో కదులుతున్నాయి. ఈ ప్రక్రియలో పది మందితో కమిటీ ఏర్పాటు, జాతీయ కార్యవర్గం నుంచి కొందరు నాయకులను తప్పించడం, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్ వంటివి ముఖ్యమైన అంశాలుగా కొత్త వ్యూహంలో భాగంగా ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి పది మందితో కమిటీని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి నుంచి నాయకత్వ వరకు ఉన్న లోపాలను గుర్తించి, నిర్దిష్ట చర్యలు చేపట్టే దిశగా ఈ కమిటీ పని చేస్తుంది. తెలంగాణలో బీజేపీ ఇంకా స్థిరమైన సామాజిక, ప్రాంతీయ బలాన్ని సాధించలేదన్న భావనతోనే ఈ కమిటీ పనిచేస్తుందిబండి సంజయ్, కె. లక్ష్మణ్, డీకే అరుణలను జాతీయ కార్యవర్గం నుంచి తప్పించడం కేవలం పరిపాలనా మార్పు కాదు. పార్టీ వర్గాల ప్రకారం ఇది తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించే వ్యూహంలో భాగం. జాతీయ స్థాయి బాధ్యతల నుంచి విముక్తి చేయడం ద్వారా వారిని రాష్ట్ర స్థాయి పనులపై పూర్తి శ్రద్ధ పెట్టే అవకాశం కల్పించింది. ఇది అంతర్గత సమతుల్యతను కాపాడుతూ, రాష్ట్ర కార్యాచరణను వేగవంతం చేసే ప్రయత్నంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నవంబర్ నుంచి తెలంగాణపై బీజేపీ పూర్తి దృష్టి పెట్టనుంది. ఈ సమయంలో రాష్ట్ర కమిటీలో బండి సంజయ్, ఈటల రాజేందర్‌లకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ఇది అనుభవజ్ఞులైన నాయకులను ముందుకు తీసుకువచ్చి, సంస్థాగతంగా, రాజకీయంగా బలమైన బృందాన్ని తయారు చేస్తుంది. 2023 ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, మరింత సమన్వయంతో కార్యాచరణ సాగించాలన్న ప్రణాళికతో ముందుకెళ్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ ప్రతిపక్ష పాత్ర, బీజేపీ మూడో స్థానంలో ఉంది.

2028 ఎన్నికల నాటికి త్రిముఖ పోరులు బిజెపిని ముందు నిలిపేలా అధిష్టానం వ్యూహాత్మకంగా పావులు కలుగుతుంది. బీజేపీకి ఇంకా విస్తృత సామాజిక బేస్, స్థిరమైన నాయకత్వం, స్థానిక సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయం అవసరం. 10 మెన్ కమిటీ, నాయకత్వ సర్దుబాట్లు, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్.. ఇవన్నీ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా కనిపిస్తున్నాయి. 2028 లక్ష్యం చాలా దూరంగా ఉన్నప్పటికీ, ఇప్పటి నుంచే సంస్థాగత పునాదులు వేయాలనేది అధిష్టానం ఆలోచన. బీజేపీ తెలంగాణలో కేవలం ప్రతిపక్ష పాత్రకే పరిమితం కాకుండా, అధికార పార్టీగా మార్చాలని స్పష్టమైన లక్ష్యంతో అధినాయకత్వం చర్యలు చేపట్టింది. ఎందుకు అవసరమైన వ్యూహాలతో ముందుకు కదులుతోంది. ఈ వ్యూహాలు ఎంతవరకు విజయవంతమవుతాయో రాబోయే రోజుల్లో స్పష్టత వస్తుంది.

# డోర్నకల్‌లో కోఆప్షన్ సభ్యుల ఎంపిక




డోర్నకల్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని, వివిధ సామాజిక వర్గాలకు చెందిన కోఆప్షన్ సభ్యులుగా ఎంపికైన ×ఎస్.కె. ఖాదర్ బాబా (మైనార్టీ), శీలం భార్గవ్ (బీసీ), ఎపూరి కృష్ణ (ఎస్సీ)×లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి, వైస్ చైర్మన్ మాద లావణ్యతో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎంపికైన సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## సైబరాబాద్ లో ముగ్గురు డ్రగ్ పెడ్లర్స్ అరెస్ట్

హైదరాబాద్ శేరిలింగంపల్లిలో పోలీసులు ముగ్గురు డ్రగ్ సెడ్లర్స్ ను అరెస్టు చేసారు. వారినుంచి 94 గ్రాముల ఎటఎజీ డ్రగ్, 50 గ్రామ్స్ ఓజీ డ్రగ్ సీజ్ చేసారు. ఈ నెల 11 వ తేదీన గచ్చిబౌలి పీఎస్ లిమిట్స్ వట్టినాగులపల్లి లో ఒక డ్రగ్ పెడ్లర్ డ్రగ్స్ సప్లై చేస్తుండగా పట్టుకున్నాం.. నిందుతుని తో పాటు 16 మంది కంజ్యూమర్లను అదుపులోకి తీసుకున్నాం.. నిందితుడు యస్వంత్ సాయి ని విచారించగ బెంగళూరు కు చెందిన నవీనా, కేరళ కు చెందిన అబ్దుల్ గఫూర్ ల నుండి డ్రగ్ తెచ్చినట్లు వెల్లడి అయింది. నవీనా, గఫూర్ లను కూడా అదుపులోకి తీసుకున్నామని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్.. సైబరాబాద్ నూు డీసీపీ శోభన్ వెల్లడించారు.

# బీసీలకు 34% రిజర్వేషన్ - గోనెగండ్లలో టీడీపీ సంబరాలు





గోనెగండ్ల: ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ గోనెగండ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలకంగా వ్యవహరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించిందని, కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# కమలంలో భారీ పెరుగుతున్న ఆశవాహులు11

హైదరాబాద్, ఆగస్టు 19, గతేడాది ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనూహ్య విజయాలు నమోదు చేసి అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లకు గట్టి ఝలక్ ఇచ్చిన భారతీయ జనతా పార్టీ.. రాబోయే ఎమ్మెల్సీ పోరుకు సిద్ధమవుతోంది. నల్గొండ? వరంగల్? ఖమ్మం, మహబూబ్‌నగర్? రంగారెడ్డి? హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం పావులు కదుపుతోంది. అయితే ఎన్నికల వ్యూహాల కంటే ముందే పార్టీలో టికెట్ల లొల్లి, అంతర్గత కుమ్ములాటలు తెరపైకి రావడం కాషాయ శిబిరంలో కాకరేపుతోంది. గత ఏడాది కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి చింతపండు అంజిరెడ్డి, అలాగే మెదక్ కరీంనగర్ ఆదిలాబాద్‌నిజామాబాద్ ఉపాధ్యాయ స్థానం నుంచి ఎం. కొమరయ్య ఘన విజయం సాధించి పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. అయితే, ఆ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నుంచే మొదలైన అంతర్గత అసంతృప్తి ఇప్పుడు తాజా ఎమ్మెల్సీ పోరులో మరింత తీవ్రరూపం దాలుస్తోంది. పార్టీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్లకు ప్రాధాన్యమివ్వాలా లేక ఇతర పార్టీల నుంచి వచ్చిన తాజా నేతలకు అవకాశం కల్పించాలా? స్థానిక నేతలకు ఇవ్వాలా లేక బయటి వ్యక్తులను రంగంలోకి దించాలా? అన్న రెండు ప్రధాన ప్రశ్నలు నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మహబూబ్‌నగర్ రంగారెడ్డి? హైదరాబాద్ స్థానం బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. దాదాపు ఆరు లక్షల మంది ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో అగ్రవర్ణాలు, పట్టణ విద్యావంతులే బీజేపీకి ప్రధాన బలం. ప్రస్తుతం ఇక్కడ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె సురభి వాణీదేవి 2021లో బీఆర్ఎస్ నుంచి గెలిచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ స్థానాన్ని గతంలో అంటే 2015లో నాటి బీఆర్ఎస్ హవాలోనూ గెలుచుకున్న ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు.. ఆ తర్వాతి ఎన్నికల్లో వాణీదేవి చేతిలో స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఈసారి ఇక్కడి నుంచి పీవీ నరసింహారావు మనవడు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ బరిలోకి దిగాలని భావిస్తున్నారు. అమెరికాలో పీజీ ఇంజనీరింగ్ చదివిన విద్యావంతుడిగా, పార్టీ సంస్థాగత బలోపేతానికి పనిచేసిన నాయకుడిగా ఆయన తన వాదనను బలంగా వినిపిస్తున్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఎస్. మల్లా రెడ్డి కూడా ఎప్పటినుంచో పార్టీని నమ్ముకున్న విధేయుడిగా తనకు అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అయితే, సమీకరణాలు మారితే స్వయంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావే మళ్లీ బరిలోకి దిగే అవకాశాలున్నాయని లేదా అనూహ్యంగా మరొకరి పేరు తెరపైకి వచ్చినా ఆశ్చర్యం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నల్గొండ? వరంగల్? ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలోనూ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. సీనియర్ నాయకులు ఎస్. ప్రకాశ్ రెడ్డి, జి. మనోహర్ రెడ్డి, జి. ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు టికెట్ రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావులతో కూడిన కమిటీ అభ్యర్థుల పేర్లను పరిశీలించి హైకమాండ్ ఆమోదానికి పంపనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తామని పార్టీ అధిష్టానం చెబుతున్నప్పటికీ, గ్రూపు రాజకీయాలు, లాబీయింగ్ అధిపత్యం ప్రదర్శిస్తున్నాయి. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల ఎన్నికలకు ప్రతిసారీ ఓటర్ల నమోదు కొత్తగా జరగాల్సి ఉంటుంది. కనీసం మూడేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లను పెద్ద ఎత్తున ఓటర్లుగా నమోదు చేయించడమే తమ ప్రధాన వ్యూహమని పార్టీ భావిస్తోంది. విద్యార్థి ఉద్యమాలు తమ గెలుపుపై ప్రభావం చూప బోవని నాయకత్వం ధీమాగా ఉన్నప్పటికీ, అంతర్గత అసమ్మతిని చక్కదిద్ది, బలమైన కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాలను అధిగమించి కాషాయ జెండాను ఎగరేయడం బీజేపీకి నిజమైన సవాలే.

# కాంగ్రెస్ ను కబళిస్తున్న 22 ఏ

హైదరాబాద్, ఆగస్టు 19, తెలంగాణలో రిజిస్ట్రేషన్ల చట్టం-1908లోని సెక్షన్ 22-ఎ పేరిట జరుగుతున్న వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతోంది. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్, సీలింగ్ మిగులు భూముల పరిరక్షణ పేరిట చేపట్టిన రెవెన్యూ రికార్డులను అప్ డేట్ ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ఏకంగా లక్షలాది మంది సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రైవేటు ఆస్తులు నిషేధిత జాబితాలోకి చేరిపోయాయి. జీవితకాల కష్టార్జితంతో చట్టబద్ధమైన అనుమతులతో కొనుగోలు చేసుకున్న సొంత ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లపై రాత్రికి రాత్రే నిషేధిత ముద్ర పడటం సామాన్యుడి గుండెల్లో పిడుగుపాటులా మారింది. ఈ సంక్షోభం తీవ్రత ప్రధానంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోనే అత్యధికంగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 22-ఎ జాబితాలో చేరిన ఆస్తుల్లో దాదాపు 54 శాతానికి పైగా కేవలం మేడ్చల్-మల్కాజ్‌గిరి , రంగారెడ్డి , సంగారెడ్డి , హైదరాబాద్ కోర్ సిటీ జిల్లాల్లోనే ఉన్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, చందానగర్, ఉప్పల్ వంటి అత్యంత కీలకమైన నివాస ప్రాంతాల్లోని లక్షకు పైగా ప్రాపర్టీలు ఈ జాబితాలో చిక్కుకుపోయాయి. వీటి మార్కెట్ విలువ రూ. లక్ష కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ప్రాపర్టీలపై రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బ్యాంకులు రుణాలు, మార్ట్‌గేజ్‌లను ఆపివేయడం రియల్ ఎస్టేట్ మరియు బ్యాంకింగ్ రంగాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. అత్యవసర వైద్య ఖర్చులు, పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్ల కోసం తమ ఆస్తులను అమ్ముకుందామనుకున్న వేలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద లబోదిబోమంటున్నారు. అధికారుల తప్పిదం వల్ల ప్రైవేటు ఆస్తులు ఈ జాబితాలోకి ఎక్కగా, ఇప్పుడు మళ్లీ ప్రజలే తమ ఆస్తులను 22-ఎ నుంచి తొలగించాలంటూ కలెక్టరేట్లు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి రావడం తీవ్ర అన్యాయం. తమ తప్పేమీ లేకుండా పౌరులే దరఖాస్తు చేసుకోవాలనడం, ప్రజాపాలన పేరిట ప్రజలను మరోసారి దళారీ వ్యవస్థల కోరల్లోకి నెట్టడమే అవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తీవ్ర వ్యతిరేకతను గమనించిన రెవెన్యూ మంత్రి అధికారుల తప్పిదాలకు క్షమాపణలు చెప్పి, హైలెవల్ కమిటీ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే కేవలం సారీ చెప్పడంతోనో, మొక్కుబడి కమిటీలతోనో ఈ సమస్య పరిష్కారం కాదు. గతంలో హైకోర్టు ఆదేశాల ద్వారా నిషేధిత జాబితా నుంచి క్లియర్ అయిన భూములను కూడా రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేయకపోవడం అధికారుల క్షమించరాని నేరం. ప్రజలు దరఖాస్తు చేసుకునే వరకు వేచిచూడకుండా, ప్రభుత్వమే యుద్ధప్రాతిపదికన సుమోటో'గా డిజిటల్ డేటాను ప్రక్షాళన చేసి అన్ని ప్రైవేట్ రిజిస్టర్డ్ లేఅవుట్లను వెంటనే విడుదల చేయాలి. ప్రజాస్వామ్యంలో భూమి, సొంతిల్లు అనేది ప్రతి పౌరుడి భావోద్వేగంతో ముడిపడిన అత్యంత సున్నితమైన అంశం. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్, ఇలాంటి సున్నితమైన ఆస్తి హక్కుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల నుంచి వచ్చే తిరుగుబాటు తీవ్రంగా ఉంటుంది. ఈ 22-ఎ సమస్యను కాలయాపన చేయకుండా తక్షణమే పూర్తిగా పరిష్కరించకపోతే, అది ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేకతకు దారితీసి కాంగ్రెస్ పార్టీ పునాదులనే కదిలించే ప్రమాదం ఉంది.

# సంక్షేమ పథకాలు చుట్టూ దుమారం

హైదరాబాద్, ఆగస్టు 19, తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సంక్షేమ పథకాల చుట్టూ తీవ్ర దుమారం రేగుతోంది. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అమలవుతున్న ప్రతిష్టాత్మక కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఊరూరా కాంగ్రెస్ నేతలను నిలదీయాలని, లబ్ధిదారుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ పథకాలపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులే తాజా రాజకీయ వివాదానికి ప్రధాన ఆజ్యం పోశాయి. 2014 నుంచి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలకు అసెంబ్లీ చట్టబద్ధత లేదంటూ ఒక న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, ఆ జీవోలపై స్టే విధిస్తూ చెల్లింపులను నిలిపివేయాలని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తరఫున సకాలంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం వల్లే కోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు వ్యవహారాన్ని సాకుగా చూపి రూ. 1,00,116 ఆర్థిక సాయం అందించే పథకాలను పూర్తిగా ఎత్తివేసే ఆలోచనలో కాంగ్రెస్ ఉందని బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. ఈ వివాదం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. ఇందుకు పలు కీలక అంశాలు కారణమవుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ కల్యాణ లక్ష్మి సాయంతో పాటు 'తులం బంగారం' ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చాక నిబంధనల రూపకల్పన, ఖజానాపై పడే అదనపు భారం తదితర కారణాలతో ఈ హామీ పూర్తిస్థాయిలో పట్టాలెక్కకపోవడం ప్రతిపక్షానికి రాజకీయ అస్త్రంగా మారింది. బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టడం వల్ల వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడి చెల్లింపుల్లో జాప్యం జరిగింది. దీనిని బీఆర్ఎస్ పథకం నిలిపివేతగా ప్రచారం చేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి బ్రాండ్‌గా నిలిచిన కేసీఆర్ కిట్, రైతుబీమా, కల్యాణ లక్ష్మి వంటి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం క్రమంగా పక్కన పెడుతోందనే రాజకీయ విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వ్యూహాన్ని గులాబీ పార్టీ అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే, ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ఎక్కడా అధికారికంగా ప్రకటించలేదు. వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా ఈ పథకాలకు నిధుల కేటాయింపులు కూడా కొనసాగుతున్నాయి. హైకోర్టు స్టే వ్యవహారంలోనూ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నేతలు కొట్టిపారేస్తున్నారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించడానికి త్వరలోనే పటిష్టమైన కౌంటర్ దాఖలు చేసి, అవసరమైతే చట్టసభ ఆమోదంతో పథకానికి రక్షణ కల్పిస్తామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సంక్షేమాన్ని తాము మరింత పారదర్శకంగా అమలు చేయాలని చూస్తుంటే, బీఆర్ఎస్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తోంది. తెలంగాణలో మహిళా ఓటు బ్యాంకు అత్యంత కీలకం కావడంతో, కల్యాణ లక్ష్మి వంటి పథకంపై జరుగుతున్న ఈ యుద్ధం కేవలం సంక్షేమానికి సంబంధించినది మాత్రమే కాదు.. పూర్తిస్థాయి రాజకీయ ఆధిపత్య పోరాటంగా మారింది. కోర్టులో ప్రభుత్వ కౌంటర్, తులం బంగారం అమలుపై అధికార పక్షం ఇచ్చే స్పష్టతే ఈ రగడకు ముగింపు పలకనుంది.

## పోలీస్ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### -ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువతకు పిలుపు

చంద్రుగొండ/జూలూరుపాడు ఆగస్టు 18 ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నిరుద్యోగ యువత పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎస్.కె. వసీంపాషా కోరారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు జిల్లాల నిరుద్యోగ యువత కోసం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో రాష్ట్రస్థాయిలో పేరొందిన అధ్యాపకులతో బోధన, ప్రామాణిక పుస్తకాల ఉచిత పంపిణీ, ప్రతిరోజూ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు, వారానికి ఒకసారి ప్రత్యేక పరీక్షలు, శారీరక దారుఢ్య సాధన వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలు సాధించేలా నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పేర్ల నమోదుకు చివరి తేదీ: 27 ఆగస్టు 2026శిక్షణ ప్రారంభం: 1 సెప్టెంబర్ 2026,మరిన్ని వివరాల కోసం ఖమ్మం: 8985095599, కొత్తగూడెం: 8985096699 నంబర్లను సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసు ఉద్యోగ సాధన దిశగా ముందడుగు వేయాలని ఎస్.కె. వసీంపాషా కోరారు.

## రాష్ట్ర గీతమే ఫస్ట్: మద్రాస్ హైకోర్టు

తమిళనాడులో ప్రభుత్వ కార్యక్రమాలలో మొదటగా రాష్ట్ర గీతం 'తమిళ్ తాయ్ వాళ్తు'ను ఆలపించాలని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల కేంద్ర హోం శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో వందేమాతరం ముందు పాడాలని ఎక్కడా పేర్కొనలేదని, రాష్ట్ర గీతాన్ని చివరి స్థానానికి నెట్టేయలేదని కోర్టు వ్యాఖ్యానించింది. చెన్నైకి చెందిన అనన్య రాధాకృష్ణన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ స్పష్టత వచ్చింది. ప్రభుత్వ కార్యక్రమాలను తమిళ గీతంతో ప్రారంభించి, జాతీయ గీతంతో ముగించడం తమిళనాడులో చాలాకాలంగా వస్తున్న సంప్రదాయమని పిటిషనర్ వాదించారు. అయితే, ఇరుపక్షాల వాదనలు అనంతరం పిటిషన్‌పై హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది.

# ఎకరం సాధ్యమేనా

హైదరాబాద్, ఆగస్టు 19, 2014 ఎన్నికలకు ముందు అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన హామీలలో దళితులకు 3 ఎకరాల భూమి హామీ ఒకటి. అయితే, ఇది పూర్తి స్థాయిలో అమలు కాలేదు. దీంతో, కాంగ్రెస్, బీజేపీలు ఆ విషయంపై కేసీఆర్ ను నిలదీశాయి. అయితే, తాము దళితులందరికీ 3 ఎకరాల స్థలం ఇస్తామని చెప్పలేదని, స్థలం లభ్యతను బట్టి ఇస్తామని కేసీఆర్ మాట దాటేశారు. రాష్ట్రంలో స్థలాలు సరిపడినన్ని లేవు కాబట్టి ఆ పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నది గులాబీ పార్టీ నేతల వాదన. కట్ చేస్తే? తాజాగా తన తండ్రి తరహాలోనే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించిన వైనం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సీఎం రేవంత్ రెడ్డికి భూమి అంటే వ్యాపార లావాదేవీలే అని, కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని కవిత అన్నారు. పేదల అసైండ్ భూములనే ప్రభుత్వం లాక్కొని ప్రాజెక్టులకు ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' అని, చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలనతో ప్రజలు విసిగిపోయారని ఆమె ఆరోపించారు. సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ఈ ప్రభుత్వం లాక్కుందని, సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే, కవిత ఇచ్చిన హామీ ప్రాక్టికల్ గా అమలు చేయడం సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూ పంపిణీ హామీ విషయంలో కేసీఆర్ చేసిన పొరపాటే కవిత చేస్తున్నారా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

భూ లక్ష్మి' పథకం

తెలంగాణ రాజకీయ వేదికపై మరోసారి అత్యంత సున్నితమైన, ప్రభావవంతమైన భూమి అంశం తెరపైకి వచ్చింది. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రకటించిన 'భూ లక్ష్మి' పథకం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రచ్చకు తెరలేపింది. ప్రతీ పేద కుటుంబానికి ఎకరం భూమిని పంచుతామని, పార్టీ మేనిఫెస్టోలో కూడా పొందుపరుస్తామని కవిత చేసిన ప్రతిపాదన కేవలం ఒక సంక్షేమ హామీ మాత్రమే కాదు.. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లను ఒకేసారి ఆత్మరక్షణలోకి నెట్టే పక్కా వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి రాష్ట్ర అవతరణ తొలి నాళ్ల వరకు దళితులకు మూడెకరాల భూమి నినాదం కేసీఆర్ రాజకీయ ప్రస్థానంలో కీలక పాత్ర పోషించింది. అయితే, అధికారంలోకి వచ్చాక భూముల లభ్యత లేకపోవడం, మార్కెట్ ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వం కొనుగోలు చేయలేక ఆ పథకాన్ని ఆదిలోనే అటకెక్కించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కేవలం రెండు వేల ఎకరాల పంపిణీతోనే ఆ స్కీమ్ ముగిసిపోయింది. ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే, జాతీయ రాజకీయాల్లో ఎంట్రీ ఇచ్చే క్రమంలో కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా కుటుంబానికి రూ. 10 లక్షల పూర్తి సబ్సిడీ ఇచ్చే 'దళితబంధు'ను తెరపైకి తెచ్చారని విమర్శలు ఉన్నాయి. అయితే ఆ పథకం బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తిని రగిలించడమే కాకుండా, స్థానిక ప్రజాప్రతినిధుల కమీషన్ల దందా ఆరోపణలతో బీఆర్ఎస్‌కు రాజకీయంగా భారీ నష్టాన్నే మిగిల్చింది. గత చేదు అనుభవాలను, వైఫల్యాలను సరిగ్గా అంచనా వేసిన కవిత.. ఈసారి సోషల్ జస్టిస్ పేరిట రీ-డిస్ట్రిబ్యూషన్ అజెండాను చేతుల్లోకి తీసుకున్నారు. గతంలో తాము ఇప్పటికే ప్రకటించిన పాంచజన్యంలోని ఉచిత ప్రైవేటు విద్య, ఉచిత ప్రైవేటు వైద్యం హామీల సాధ్యాసాధ్యాలపై విపక్షాలు ప్రశ్నలు కురిపిస్తున్న వేళ, ఈ భూ లక్ష్మి బాంబు పేల్చడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. గత పాలకులు చేతులెత్తేసిన అంశాన్ని తాము పక్కా అధ్యయనం, నిపుణులు, మేధావుల మేధోమథనం తర్వాతే మేనిఫెస్టోలో చేర్చామని ఆమె స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, భూదాన్ భూముల్లోనే లెక్కలేకుండా పోయిన దాదాపు లక్ష ఎకరాలను వెలికితీస్తే పేదలకు పంచడం అసాధ్యమేమీ కాదని ఆమె లెక్కలు చూపుతున్నారు. సీడ్ కంపెనీల బినామీ భూములు, అన్యాక్రాంతమైన ప్రభుత్వ ఆస్తులను స్వాధీనం చేసుకునే రాజకీయ సంకల్పం ఉంటే భూపంపిణీ సాధ్యమేనన్నది ఆమె వాదన. ఈ ప్రకటన ద్వారా కవిత ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధి లోపం వల్లే భూ పంపిణీ జరగలేదని చెప్పడం ద్వారా బీఆర్ఎస్ హయాం నాటి వైఫల్యాలను గుర్తుచేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఇస్తామని, కానీ చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడే ఈ భూపంపిణీని చేపట్టాలని డిమాండ్ చేయడం ద్వారా ప్రస్తుత పాలక పక్షాన్ని ఇరుకున పెట్టడం కవిత లక్ష్యంగా కనిపిస్తోంది. పేదల భూములను ప్రాజెక్టులు లేదా ఇతర అవసరాల పేరుతో లాక్కుంటే సహించేది లేదని హెచ్చరించడం ద్వారా గ్రామీణ, పేద వర్గాలకు బలమైన భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో, ఎకరం భూమి హామీ క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతుందనేది పాలనాపరంగా పెద్ద సవాలే. కానీ, రాజకీయంగా మాత్రం ఇది కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఇబ్బందికరమైన పరిణామమే. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం అనే రెండు బలమైన భావోద్వేగ అంశాలను కలుపుతూ కవిత విసిరిన ఈ 'భూ లక్ష్మి' పాచిక రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ సమీకరణాలను ఏ మేరకు మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

## సైబరాబాద్ పరిధిలో భారీ సైబర్ మోసం..

### రూ 1 కోటి రికవరీ చేసిన పోలీసులు..

హైదరాబాద్ సైబరాబాద్ పరిధిలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది. ఈ కేసులో పోలీసులు కోటి రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ సీపీ రమేష్ మాట్లాడుతే బాస్ పేరిట నకిలీ వాట్సాప్ మెసేజ్ లో అకౌంటెంట్ ..1 కోటి నష్టపోయారు. బాదితుడి పిర్యాదు లో సైమర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసారు. 10 రోజుల్లోనే 1 కోటి సొమ్మును స్వాధీనం చేసుకుని బాధితుడికి అందించారని అన్నారు.

లక్నోకు చెందిన ప్రధాన నిందితుడు దీపక్ కుమార్ (37) అరెస్ట్ అయ్యాడు. ఆగస్టు 4న మోసం జరగ్గా.. వేగవంతంగా స్పందించి ఆగస్టు 8న నిందితుడిని పట్టుకున్నారు. కోర్టు ఉత్తర్వులతో కేవలం ఒక్క రోజులోనే బాధితుడి ఖాతాకు తిరిగి రూ. 1 కోటి డిపాజిట్ అయింది. అత్యవసర డబ్బు పంపాలంటూ ఆఫీసర్లు/బాస్ల పేరుతో వచ్చే మెసేజ్లను నమ్మవద్దని సూచించారు.

# తెలంగాణలో నిరుద్యోగులకు ఊరట

## వయోపరిమితి రెండేళ్లు పెంపు!

హైదరాబాద్, ఆగస్టు 19, తెలంగాణ రాష్ట్రంలో యూనిఫామ్ ధరించి సమాజానికి సేవ చేయాలనే లక్షల మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయంతో భారీ ఊరటనిచ్చింది. గత కొంతకాలంగా నోటిఫికేషన్ల ఆలస్యం, కరోనా తదనంతర పరిణామాల వల్ల వయసు మించిపోయి ఆందోళన చెందుతున్న అభ్యర్థుల విన్నపాలను ప్రభుత్వం సానుకూలంగా మన్నించింది. ఈ క్రమంలోనే వివిధ యూనిఫామ్ సర్వీసెస్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని అదనంగా మరో రెండేళ్లు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో నెంబర్ 122 ప్రకారం రాష్ట్రంలోని ఏడు ప్రధాన యూనిఫామ్ శాఖల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు లభించనుంది. ఇప్పటికే మే 18, 2026 నుంచి ప్రభుత్వం ఐదేళ్ల వయోపరిమితి పెంపును అమలు చేస్తోంది. ఇప్పుడు దానికి అదనంగా మరో రెండేళ్లు జోడించడంతో అభ్యర్థులకు లభించే మొత్తం వయోసడలింపు ఏకంగా 7ఏళ్లు చేరింది. దీని వల్ల వయసు పైబడి పోటీకి దూరమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ ప్రాణం పోసినట్టు అయ్యింది. ఈ వయోపరిమితి పెంపు వర్తించే ప్రధాన శాఖలు ఏంటంటే... తెలంగాణ పోలీస్ శాఖ అయిన సివిల్ ఎస్ఐ కానిస్టేబుల్, ఏఆర్, టీఎస్ఎస్పీ , కమ్యూనికేషన్స్ పోస్టులకు వర్తిస్తుంది. అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ పోస్టులకు ఇది అమలు అవుతుంది. జైళ్ల శాఖ డిప్యూటీ జైలర్, వార్డర్ పోస్టుల్లో వర్తింపజేస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, అటవీ శాఖలోని ఉద్యోగాలకు కూడా వర్తింపజేస్తారు.

ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?

ఈ వయోపరిమితి పెంపు నిర్ణయం కేవలం భవిష్యత్‌లో వచ్చే నోటిఫికేషన్లకే పరిమితం కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియకు కూడా ఈ ఏడేళ్ల సడలింపు వర్తిస్తుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఇప్పటికే అప్లై చేయలేకపోయిన అభ్యర్థులకు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి అవకాశం కల్పించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో సామాన్య కేటగిరీ అభ్యర్థులతోపాటు రిజర్వేషన్ వర్గాల వారికి కూడా గరిష్ట వయస్సు గణనీయంగా పెరిగింది.

ఉద్యోగ హోదా బేసిక్ వయోపరిమితి పాత సడలింపు
కొత్త సడలింపుతో కలిపి ఎంత కొత్త గరిష్ట అర్హత వయసు
పోలీస్ కానిస్టేబుల్ 22 ఏళ్లు 27 ఏళ్లు+7 ఏళ్లు 29 ఏళ్లు
సబ్ఇన్స్పెక్టర్ 25 ఏళ్లు 30 ఏళ్లు +7ఏళ్లు 32 ఏళ్లు
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ 31 ఏళ్లు 36 ఏళ్లు +7ఏళ్లు 38 ఏళ్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పై పేర్కొన్న ఏడేళ్ల సడలింపుతోపాటు వారి కేటగిరీకి వర్తించే అదనపు 5 ఏళ్ల మినహాయింపు కూడా అందుబాటులో ఉంటుంది. దీని వల్ల రిజర్వేషన్ అభ్యర్థులకు కానిస్టేబుల్ పోస్టులకు గరిష్టంగా 34 ఏళ్ల వరకు, ఎస్ పోస్టులకు 37 ఏళ్ల వరకు పోటీ పడే అవకాశం లభిస్తుంది.

# పూడుకుపోయిన కాల్వ

**- తాలిపేరు నీరు రోడ్డు పాలు**
**- రైతులకు సాగునీటి వృధ**
**- అధికారుల నిర్లక్ష్యం... అన్నదాతకు శాపం**
**-బాధ్యతారహిత్యంగా ఇరిగేషన్ శాఖ -**
**సాగు నీటిని సక్రమంగా అందించలేని దుస్థితి**
**- అన్నదాతల్లో అసహనం**

. పంట పొలాలకు సక్రమంగా నీళ్లు అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్న అధికారుల తీరు వల్ల రైతాంగం నష్టపోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరగాల్సిన పనులపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ తీరుతో తాలిపేరు ప్రాజెక్టు కింద సాగునీరు రైతుల పొలాలకు వెళ్లే విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి అయినా సరే పట్టించుకునే నాధుడే కరువయ్యారు చర్ల , ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):రైతుల పంట పొలాలకు చేరాల్సిన తాలిపేరు ప్రాజెక్టు సాగునీరు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపాలవుతోంది. రాళ్లగూడెం గ్రామ పరిధిలో సాగునీటి కాలువ పూడిక, చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి, పొలాలకు వెళ్లాల్సిన నీరు ప్రధాన రహదారిపైకి పొంగిపొర్లుతోంది. దీంతో విలువైన సాగునీరు వృథాగా పోతుండగా.. రైతులు మాత్రం పంటలకు నీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.రైతుల పొలాలకు నీరు చేరేలా కాలువలను నిర్వహించడం ఇరిగేషన్ శాఖ ప్రాథమిక బాధ్యత కాదా? అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలువలో పూడిక పేరుకుపోయి నీరు పొలాలకు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రైతులకు అందాల్సిన నీటిని సక్రమంగా మళ్లించలేని పరిస్థితి ఉంటే తాలిపేరు ప్రాజెక్టు నీటి ప్రయోజనం రైతులకు ఎలా అందుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి చుక్క నీరు రైతుకు ప్రాణాధారం.. అధికారులు మాత్రం పట్టించుకోరా?ఇప్పటికే వర్షాలు సరిగా లేక సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రాజెక్టు నుంచి అందుబాటులోకి వస్తున్న నీటిని సైతం కాలువల నిర్వహణ లోపంతో రోడ్డుపైకి మళ్లించడం రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు.పంటలకు చేరాల్సిన నీరు రోడ్డుపై ప్రవహిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ రైతులు నిలదీస్తున్నారు. కాలువలో పూడిక తొలగించడం, నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించడం వంటి కనీస చర్యలు కూడా చేపట్టకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# ఏసీబీ వలకు చిక్కిన ప్రశంసా పత్రం అందుకున్న "ఉత్తమ అధికారి"..




ఒంగోలు ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి చిక్కుకున్నాడు. రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఆర్ఐ ఏసీబీకి చిక్కాడు.× ఒంగోలు కార్పొరేషన్ ఆర్ఐ నరేంద్రను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కొత్త ఇంటికి పన్ను విధించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ. లంచం తీసుకుంటుండగా రెడ్హ్యాండెడ్గా ఏసీబీకి నరేంద్ర చిక్కాడు. × ఇటీవలే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'ఉత్తమ అధికారి'గా మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఇప్పుడు ఏసీబీకి చిక్కడం తీవ్ర చర్చకు దారితీసింది..

# రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీనా..

## కాంగ్రెస్ పై తిరుగుబాటా

నల్గొండ, ఆగస్టు 19, తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు మరోసారి పెద్ద దుమారాన్నే రేపాయి. బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైంది , రాజకీయాలను మార్చే శక్తి నాకుంది అంటూ ఆయన చేసిన కామెంట్లు, కొత్త పార్టీ పెడతారా లేక స్వపక్షంపైనే తిరుగుబాటా అనే ఉత్కంఠను రేకెత్తించాయి. కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కీలక పదవులు కట్టబెడుతున్నారని రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా సీమాంధ్ర కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో ప్రభుత్వం నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించడం నేరుగా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రశ్నించడమే. కేబినెట్ విస్తరణ ఆలస్యం కావడం, తన కీలక అనుచరులకు ప్రాధాన్యత దక్కకపోవడం పట్ల ఆయనలో గూడుకట్టుకున్న తీవ్ర అసంతృప్తికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి.రాజగోపాల్ రెడ్డి సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని గమనిస్తే, ఆయన ప్రెజర్ పాలిటిక్స్ చేయడంలో దిట్ట. గతంలో మునుగోడు ఉపఎన్నిక సమయంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడం, ఆ తర్వాత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మళ్లీ కాంగ్రెస్ గూటికి రావడం ఆయన రాజకీయ వ్యూహాల్లో భాగమే. ప్రభుత్వం ఏర్పాటై ఇంతకాలమవుతున్నా తనను మంత్రివర్గంలోకి తీసుకోకపోవడంతో, అధిష్ఠానంపై ఒత్తిడి పెంచి రాబోయే కేబినెట్ విస్తరణలో బెర్త్ ఖరారు చేసుకోవడానికే ఇటువంటి తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారనే ప్రచారం బలంగా ఉంది.తమిళనాడు తరహా రాజకీయ మార్పు తెస్తా, కొత్త రాజకీయ శక్తులను ప్రోత్సహిస్తా అని ఆయన అనడం కొత్త పార్టీ వైపు సంకేతాలు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కొత్త పార్టీ పెట్టడం అంత సులభం కాదు. బయటకు వస్తే ఎమ్మెల్యే సభ్యత్వం రద్దవుతుంది. రాజగోపాల్ రెడ్డికి నల్గొండ జిల్లాల్లో పట్టు ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా సొంతంగా ఒక పార్టీని నడిపించే వ్యూహాత్మక నిర్మాణం, పార్టీ క్యాడర్ బలం తక్కువ.

అందువల్ల కొత్త పార్టీ అనేది ఒక హెచ్చరిక మాత్రమేనని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.సొంత పార్టీ నుంచే కాక, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర హెచ్చరికలు చేయడం తో రాజగోపాల్ రెడ్డి వెంటనే డ్యామేజ్ కంట్రోల్ చర్యలకు దిగారు. నేను కాంగ్రెస్ పార్టీని లేదా రాహుల్ గాంధీని విమర్శించలేదు, రాహుల్ నాయకత్వంలోనే పనిచేస్తా అని వెనక్కి తగ్గారు. పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకునే ప్రమాదం ఉందని గ్రహించి, లేదా అధిష్ఠానం నుంచి స్పష్టమైన సంకేతాలు రావడంతోనే ఆయన తన వ్యాఖ్యలకు సవరణ ఇచ్చుకున్నారు. రాజగోపాల్ రెడ్డి తీరు కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత అసమ్మతి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది. రేవంత్ రెడ్డి వైఖరి పట్ల సీనియర్ కాంగ్రెస్ నాయకులలో ఉన్న అసంతృప్తికి రాజగోపాల్ రెడ్డి ఒక స్పానర్ లాగా మారారు. ఈ వ్యాఖ్యలను అధిష్ఠానం తీవ్రంగా పరిగణిస్తే ఆయనపై క్రమశిక్షణా చర్యలు తప్పవు. ఒకవేళ ఆయన డిమాండ్లకు లొంగి మంత్రి పదవి ఇస్తే, పార్టీలో అసమ్మతి గళం విప్పే మిగతా నాయకులకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి.

రాజగోపాల్ రెడ్డి ప్రస్తుతం కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో లేరు . ఆయన వ్యూహమల్లా తన వర్గానికి సరైన ప్రాధాన్యత దక్కించుకోవడం, కేబినెట్‌లో మంత్రి పదవిని సాధించడం మాత్రమే. అయితే, ప్రభుత్వంపై ప్రతిపక్షాల కన్నా దారుణంగా అవినీతి, బయటివారి పెత్తనం అంటూ బహిరంగంగా ఆరోపణలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటోంది.

అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగి ఈ వివాదానికి స్వస్తి పలకకపోతే, ఇది తెలంగాణ కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున అంతర్గత కుమ్ములాటలకు దారితీసే అవకాశం ఉంది.

# ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద విద్యార్థుల ఆందోళన:

## విద్యార్థుల పై పోలీసుల దాడి ఆరోపణలు....?

రాయదుర్గం పీఎస్ పరిధిలోని ఖాజాగూడ ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కాలేజ్ ఎదుట విద్యార్థులు చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పాలిటెక్నిక్ (ఇాబిఖ) విద్యా విధానంలో మార్పులు, యూత్ స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదనలు రద్దు చేసి 'లేటరల్ ఎంట్రీ'ని యథావిధిగా కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.?నిరసన తెలుపుతున్న విద్యార్థులను అడ్డుకునే క్రమంలో పోలీసులు తమపై దాడి చేశారని విద్యార్థులు ఆరోపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను నిలువరించే ప్రయత్నం చేయడంతో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని విద్యార్థులు స్పష్టం చేయడంతో ఆందోళన కొనసాగుతోంది.

# 50 ఏళ్లలో ఎవరూ చేయని పని..

**బ్రాహ్మణపల్లిలో ప్రతి వీధికీ ఓ గుర్తింపుసర్పంచ్ ఈది కనకతార వినూత్న శ్రీకారం.**

**గ్రామ పాలనలో కొత్త ఒరవడి**

బోనకల్ గత 50 ఏళ్లుగా ఎంతో మంది పాలకులు వచ్చారు.. వెళ్లారు.. కానీ ఎవరూ పట్టించుకోని ఓ వినూత్న కార్యక్రమానికి బ్రాహ్మణపల్లి గ్రామంలో శ్రీకారం చుట్టారు. బోనకల్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ ఈది కనకతార ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి వీధి రోడ్డుకు ప్రత్యేక నంబర్ కేటాయిస్తూ చర్యలు చేపట్టారు.గ్రామంలో ఇప్పటివరకు వీధులకు ప్రత్యేక గుర్తింపు లేకపోవడంతో ఆయా ప్రాంతాలను గుర్తించడంలో ప్రజలు, ఇతరులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ప్రతి వీధికి ప్రత్యేక రోడ్ నంబర్ కేటాయించడం ద్వారా గ్రామంలోని ప్రతి ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల ప్రస్తుతం సర్పంచ్ ఈది కనకతార ఆధ్వర్యంలో చేపట్టిన ఈ చర్య గ్రామ అభివృద్ధిలో చిన్నదిగా కనిపించినా.. భవిష్యత్‌లో గ్రామ పరిపాలనను మరింత క్రమబద్ధీకరించేందుకు ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.ప్రతి వీధికి నంబర్ ఉండటంతో గ్రామంలో చిరునామాల గుర్తింపు సులభతరం కావడంతో పాటు అత్యవసర సేవలు, పోస్టల్ సేవలు, ప్రభుత్వ సేవలు అందించే సమయంలో కూడా ప్రయోజనం కలగనుందని గ్రామస్తులు అంటున్నారు. ముఖ్యంగా బయట ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆయా వీధులను గుర్తించడం సులభతరం కానుంది.ఇన్నాళ్లూ పేరుతో మాత్రమే గుర్తించబడిన వీధులకు ఇకపై ప్రత్యేక నంబర్లతో గుర్తింపు రావడంతో బ్రాహ్మణపల్లి గ్రామానికి కొత్త రూపు సంతరించుకుంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 50 ఏళ్లలో ఎవరూ చేయని పనికి సర్పంచ్ శ్రీకారం చుట్టడం గ్రామ పాలనలో వినూత్న మార్పుకు నాంది పలికిందని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



కడప జిల్లా... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఘటనలో మైదుకూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పసల వెంకటయ్య(50) దుర్మరణం పాలయ్యాడు. గుర్తుపట్టడానికి వీలు లేని విధంగా మృతదేహం ఛిద్రమయింది. బుధవారం తెల్లవారుజామున తన స్వగ్రామం పప్పనపల్లె నుండి మున్సిపాలిటీ పారిశుద్ధ్య విధులకు మైదుకూరు కు వస్తుండగా సుమారు నాలుగున్నర గంటలకు దుర్ఘటన జరగింది. సంఘటనపై మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు.

# నకిలీ టికెట్లతో జెడ్డా వెళ్లేందుకు యత్నం..

## శంషాబాద్‌లో దంపతులు అరెస్ట్

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నకిలీ విమాన టికెట్లతో జెడ్డా వెళ్లేందుకు ప్రయత్నించిన దంపతులను అధికారులు పట్టుకున్నారు. ఖతార్ ఎయిర్‌లైన్స్ విమాన టికెట్లను అధికారులకు చూపించగా, అవి నకిలీవని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. విచారణలో, ఒక ఏజెంట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసినట్లు దంపతులు తెలిపారు. విదేశాలకు పంపిస్తామని చెప్పి ఏజెంట్ వారిని మోసం చేసి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# దారి మార్చితే ట్రాఫిక్ మారుతుందా?

## (హైదరాబాద్‌కు కావాల్సింది వన్‌వేలు కాదు... సమగ్ర రవాణా ప్రణాళిక)

(హెచ్.ప్రతాప్)

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక ఉపశమనం కలిగించేందుకు చేపట్టిన కేబీఆర్ పార్క్ వన్‌వే ప్రయోగం నగర రవాణా వ్యవస్థపై మరోసారి కీలక చర్చకు తెరతీసింది. 5.9 కిలోమీటర్ల పరిధిలో అమలు చేస్తున్న ఈ విధానం తొలిరోజే వాహనదారులకు ఇబ్బందులు, మళ్లింపులు, ఆలస్యాలను ఎదురుచూపించింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 నుంచి కేబీఆర్ పార్క్ ప్రవేశద్వారం వరకు సుమారు 5 కిలోమీటర్ల దూరానికి సాధారణంగా 10--15 నిమిషాలు పడుతుండగా, ప్రయోగం తొలిరోజు 45 నిమిషాలు పట్టినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే కొత్త ట్రాఫిక్ విధానానికి వాహనదారులు అలవాటు పడటంతో పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

కానీ అసలు ప్రశ్న కేబీఆర్ పార్క్ దగ్గర ట్రాఫిక్ ఎలా తగ్గించాలన్నది మాత్రమే కాదు; వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌కు ఎలాంటి రవాణా నమూనా అవసరం? అన్నదే. గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, మాదాపూర్, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, నార్సింగి ప్రాంతాల్లో రద్దీ నిత్యకృత్యంగా మారింది. వర్షం, రోడ్డు పనులు, చిన్న వాహనాల బ్రేక్‌డౌన్ కూడా ఈ మార్గాల్లో కిలోమీటర్ల మేర రద్దీకి కారణమవుతున్నాయి. మియాపూర్--కూకట్‌పల్లి, హఫీజ్‌పేట్, ఐకియా జంక్షన్, కూకట్‌పల్లి--మాదాపూర్, రైదుర్గ్--హైటెక్‌సిటీ మార్గాల్లోనూ తరచూ ట్రాఫిక్ సమస్యలు కనిపిస్తున్నాయి.

ఇది కేవలం రహదారుల కొరత సమస్య కాదు. వ్యక్తిగత వాహనాలపై అధిక ఆధారపడటం, కార్యాలయాలు ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కావడం, పాదచారులకు సరైన మార్గాలు లేకపోవడం, పార్కింగ్ లోపాలు, రోడ్డు పనుల సమన్వయ లోపం, ప్రజా రవాణాలో చివరి మైలు అనుసంధానం బలహీనంగా ఉండటం వంటి అంశాలు కలిసి సమస్యను సంక్లిష్టం చేస్తున్నాయి. ఒకచోట ఫ్లైఓవర్ నిర్మిస్తే మరోచోట జంక్షన్ వద్ద రద్దీ పెరగడం, ఒక మార్గాన్ని వన్‌వేగా మార్చితే పక్క మార్గాలపై ఒత్తిడి పెరగడం నగర రవాణాను విడివిడిగా కాకుండా సమగ్రంగా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. గతంలో చేపట్టిన అనేక రోడ్డు మౌలిక సదుపాయాల పనులు కొన్ని జంక్షన్లలో రద్దీని తగ్గించినప్పటికీ, దీర్ఘకాలికంగా అదే విధానం సరిపోతుందా అన్న ప్రశ్న కూడా నిపుణుల నుంచి వచ్చింది.

అందుకే మెట్రో విస్తరణతో పాటు బస్సుల సామర్థ్యం, ఫీడర్ సర్వీసులు, పార్కింగ్ నిర్వహణ, పాదచారుల మౌలిక సదుపాయాలు, సిగ్నల్ సమన్వయం, రియల్‌టైమ్ ట్రాఫిక్ డేటా, కార్యాలయ ప్రాంతాల రవాణా ప్రణాళికలను ఒకే వ్యవస్థలో అనుసంధానించాలి. రోడ్డు పెంచడం కంటే రోడ్డుపై వ్యక్తిగత వాహనాల అవసరాన్ని తగ్గించడం దీర్ఘకాలిక పరిష్కారానికి కీలకం. వన్‌వేలు అవసరమైన చోట ఉపయోగపడవచ్చు; కానీ అవి శాశ్వత పరిష్కారం కావు. హైదరాబాద్ భవిష్యత్తు ట్రాఫిక్ వేగంతో కాదు, ప్రజల ప్రయాణ సౌలభ్యం, భద్రత, సమయ పొదుపుతో కొలవాలి.

# తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు గా ఎం.డి ఆజం




హైద్రావద్ ఆగస్ట్ 19; తెలంగాణ బి.సి. ఫెడరేషన్ కులాల సమితి గ్రేటర్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో బీ.సీ. సాధికారత సంస్థ బీ.సీ. భవన్ హనుమాన్ టెక్డిలి యందు జరిగినఖ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సభ్యులు మరియు తెలంగాణ రాష్ట్ర బీ.సీ. ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర బీ.సీ. మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. ఖదీర్ ఎల్బీనగర్ నియోజకవర్గం.( ఇంచార్జ్ ) తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు గా ఎం.డి ఆజం ను నియమించి నియామక పత్రం అందజేసినారు. ఈ సమావేశం లో రాష్ట్ర బీసీ కులాల ఫెడరేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు బెల్లపు దుర్గారావు మరియు తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరవనీయులు . శ్రీ. యుగంధర్ , రాష్ట్ర శ్రీజాఉపాధ్యక్షులు శ్రీ రాజా నాగేష్ సింగ్ గారు.గ్రేటర్ హైదరాబాద్. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు సంఘం వీరప్ప తెలంగాణ రాష్ట్ర గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బాణాల శ్రీకాంత్ చారి , గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక అధ్యక్షులు .నన్న రామస్వామి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పులి రాజ్ అశోక్ , గౌరవనీయులు తెలంగాణ బి.సి. ఫెడరేషన్ కులాల సమితి మహిళా అధ్యక్షురాలు .బొగ్గు సునీత , గౌరవనీయులు తెలంగాణ రాష్ట్ర బీ.సీ. ఫెడరేషన్ కులాల సమితి కోశాధి కారి . పిల్లి సాయినాథ్ తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు ఎం.డి ఆజం గారికి నియమించి నియామక పత్రం అందజేసినారు.

# డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానకార్యక్రమం






హైదరాబాద్ ఆగస్ట్ 19: ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నేడు మానవతా దృక్పథంతో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నిరుపేదలు, వృద్ధులు, కార్మికులు, చిన్నారులు మరియు ఆహారం అవసరమైన పలువురికి ఉచితంగా భోజనం అందించారు.

సేవాభావంతో సొసైటీ సభ్యులు, వాలంటీర్లు స్వయంగా పాల్గొని భోజనం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ "మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలవడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యం, విద్య, అన్నదానం మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సంస్థ ఎక్జిక్యూటీవ్ డైరెక్టర్ జి.మాధవి. పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కృతజ్ఞతలు తెలిపింది."సేవే మా ధ్యేయం -- మానవత్వమే మా బలం."అని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌కు చెందిన మరో వర్ధమాన క్రికెట్ స్టార్ హుస్సేన్ సయ్యద్

## బీ-లీగ్ మ్యాచ్‌లో ఐదు ఓవర్లలో ఏడు పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీసి రికార్డు సృష్టించాడు



హైదరాబాద్ ఆగస్టు 19 హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బి లీగ్ ప్రీక్వార్టర్ ఫైనల్‌లో రైజింగ్ స్టార్ యువ ఆటగాడు ఎస్ఎం హుస్సేన్ సయ్యద్ అద్భుత, విధ్వంసక ప్రదర్శనతో కేవలం ఏడు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. నిన్న జుజునా గ్రౌండ్స్‌లో స్పోర్టివ్ కోసం ఆడుతున్న హుస్సేన్ రెండు రోజుల మ్యాచ్‌లో కేవలం 26.2 ఓవర్లలో 80 పరుగులు చేసి టోర్నమెంట్ నుండి ప్రత్యర్థి జట్టు అవర్స్‌ను పడగొట్టడంలో కీలక పాత్ర పోషించాడు. తొలి రోజు స్పోర్టివ్స్ జట్టు 84 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. రెండవ రోజు, లంచ్‌కు ముందు కేవలం 26.2 ఓవర్లలో 80 ఓవర్ల స్వల్ప స్కోరు వద్ద ప్రత్యర్థి మార్స్‌ను అవుట్ చేయడం ద్వారా స్పోర్టివ్ తదుపరి దశకు అర్హత సాధించింది. ఈ విజయంలో ఎస్‌వీ హుస్సేన్ సయ్యద్ చాలా ముఖ్యమైన పాత్ర పోషించారు. యువ అప్ అండ్ కమర్ వేగంగా బౌలింగ్ చేస్తూ ఏడు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టాడు. అతని ఐదు ఓవర్లు మెయిడిన్లు కావడంతో ప్రత్యర్థి జట్టు ఎలాంటి పరుగులు చేయలేకపోయింది. హుస్సేన్ సయ్యద్ ఏడు పరుగులు మాత్రమే ఇచ్చాడు. మ్యాచ్ రెండో ఓవర్‌లో, అతను మొదటి బంతిని బౌల్ చేసినప్పుడు, మా జట్టులోని కౌశిక్ దానిపై అద్భుతమైన ఫోర్ కొట్టాడు, అయితే ఆ తర్వాత హుస్సేన్ ప్రత్యర్థి జట్టుకు మరో మూడు పరుగులు చేసే అవకాశం ఇవ్వలేదు మరియు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా ఐదు వికెట్లు పడగొట్టాడు. అతను ప్రత్యర్థి జట్టు యొక్క బ్యాటింగ్ లైన్‌ను నాశనం చేశాడు మరియు వారిని తక్కువ స్కోరుకే అవుట్ చేయడంలో సహాయం చేశాడు. లీగ్ స్థానం: ఎజౌ యొక్క ప్రస్తుత రౌండ్లలో అతను అత్యుత్తమ బౌలింగ్ స్పెల్‌లో ఒకటిగా పరిగణించబడ్డాడు. ఒకే మ్యాచ్ యొక్క రెగ్యులర్ చార్ట్‌లో 7 ఓవర్లు, 5 మెయిడిన్లు మరియు 5 వికెట్ల ప్రత్యేక రికార్డు నమోదు కాలేదు.

# దివ్యాంగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజాబలం:**దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో అర్హులైన 12 మంది లబ్ధిదారులకు 100% సబ్సిడీపై త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆ రోజులు.. మళ్లీ రావు

## జూబ్లీ ఆఫీసర్స్ క్లబ్ నూతన భవనం, ఎస్ఆర్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజాబలం:** ఆ రోజులు.. ఆ పాత మధురాలు ఎంతో గొప్ప వని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి గుర్తు చేసుకున్నారు. నగరంలోని జూబ్లీ ఆఫీసర్స్ క్లబ్ నూతన భవనాన్ని ఎంపీ





రఘురాం రెడ్డి బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సమాచార హక్కు కమిషనర్ పీవీ.శ్రీనివాస్, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, సి పి సునీల్ దత్, జూబ్లీ ఆఫీసర్స్ క్లబ్ నిర్వాహకులతో కలిసి మాట్లాడుతూ.. తన బాల్య జ్ఞాపకాలను ఎంపీ రఘురాం రెడ్డి గుర్తు చేసుకున్నారు.

పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడు షటిల్ బ్యాడ్మింటన్ అంటే చాలా ఇష్టమని.. ఆ తర్వాత రాష్ట్రీయ స్థాయిలో పోటీల్లో ఆడాను అని చెప్పారు. రైల్వే స్టేషన్ సమీపంలో తమ నివాసం ఉండేదని.. జూబ్లీ ఆఫీసర్స్ క్లబ్ లో షటిల్ బ్యాడ్మింటన్ ఆడేందుకు వెళ్లామని తమ మేనేజర్ ఉపేందర్ రెడ్డితో అనేవాడినని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఖమ్మం ఎంపీగా.. తన ప్రాధాన్యం విద్య, వైద్యం, సంక్షేమం, మౌలిక వసతులకని చెప్పారు. ఎంతో చరిత్ర కలిగిన జూబ్లీ ఆఫీసర్స్ క్లబ్ కు.. ప్రభుత్వపరంగా సహకారం అందేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో జూబ్లీ ఆఫీసర్స్ క్లబ్ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఓపెన్ జిమ్ ప్రారంభం

రూ. 10 లక్షలకు పైగా నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, కొప్పుల చంద్రశేఖర్, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 19:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియను బుధవారం మేడ్చల్ సీడీపీఓ కార్యాలయంలో నిర్వహించారు.

ఈ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సందర్శించి పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులు, విద్యార్హత ధృవపత్రాలు, జనన తేదీ, స్థానికత, కుల ధృవపత్రం తదితర పత్రాలను ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల ప్రకారం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

ధృవపత్రాల ప్రామాణికతను నిర్ధారించేందుకు సంబంధిత శాఖల రికార్డులతో వివరాలను సరిపోల్చారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, రెవెన్యూ శాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొని సహకరించారు.

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల ఎంపికను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా పూర్తి చేస్తామని వెల్లడించారు.

అంగన్‌వాడీ టీచర్ల నియామకంలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, మెరిట్‌కు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

## మొక్కలు నాటి వన మహోత్సవం లక్ష్యం అధిగమించాలి : అదనపు కలెక్టర్, కమిషనర్ జె.అరుణశ్రీ



**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు-19, ప్రజాబలం ప్రతినిధి:** వర్షాలు విస్తారంగా కురుస్తున్న దృష్ట్యా త్వరితగతిన మొక్కలు నాటి వన మహోత్సవం లక్ష్యం అధిగమించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ సీజన్ లో నాలుగు లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. అవసరమైన మొక్కలు , ఎరవు ,మట్టి సిద్దంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటడానికి అనువైన ప్రాంతాలను కూడా గుర్తించాలని అన్నారు. చేయూత ఫించన్ల అర్హుల జాబితా రూపొందించడానికి ఆగస్ట్ 31, 2026 తో గడువు ముగియనున్నశీదున డివిజన్ లలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసి సందేహాలు తీర్చడంతో పాటు ధరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. స్వీకరించిన ధరఖాస్తులను అర్హులు నష్టపోకుండా నిర్ణీత గడువులోగా ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. అర్హుల నుండి ఇందిరమ్మ ఇండ్ల కొరకు నిర్ణీత పత్రాలతో సహా ధరఖాస్తులు స్వీకరించాలని అన్నారు.



ఆస్తి పన్ను వసూళ్లు మెరగుపర్చడానికి భువన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. నీటి బిల్లుల ఆన్ లైన్ నమోదు ప్రక్రియ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. డివిజన్ లలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలు , నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలు గుర్తించి సంబందిత పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి , ఎ సి పి శ్రీహరి, సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించేది లేదు:డీఎంహెచ్ఓ

### గాజులరామారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ వైద్య సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం



**మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 19:** గాజులరామారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉండాల్సిన వైద్యాధికారి, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. దీనిపై సంబంధిత సిబ్బందిని వివరణ కోరిన ఆయన, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను మందుల నిల్వల పట్టికతో సరిపోల్చి పరిశీలించారు. మందుల లభ్యతతో పాటు సమీప గడువు ఉన్న మందులను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. సమీప గడువు ఉన్న మందులను సకాలంలో వినియోగించేలా, మందుల నిల్వలను పద్ధతిగా నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశారు.

అదేవిధంగా కుక్క కాటు నివారణ టీకాలు, పాముకాటు నివారణ మందుల నిల్వలను పరిశీలించారు. టీకాలు, ఇతర అత్యవసర మందులను నిర్దేశిత ఉష్ణోగ్రతలో భద్రపరిచే విధానాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డుల్లో నమోదైన వివరాలను అంతర్జాల ఆధారిత నమోదులతో సరిపోల్చి పరిశీలించారు.

ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణపై డీఎంహెచ్ఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందాల్సిన ప్రాథమిక ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనితీరును తక్షణమే మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

బయటి రోగుల సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, గర్భిణీల ఆరోగ్య పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు, పరీక్షలు, చికిత్సా సేవలను మెరుగుపరచాలని సూచించారు.

అలాగే ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలలతో సమన్వయం చేసుకుని గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాల కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థులకు టీకాలు వీలైనంత త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.

## ప్రజలకు రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 19:** ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, 22ఏ నిషేధిత భూముల జాబితాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లను ఆదేశించారు.

బుధవారం మేడ్చల్ మండలంలోని సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, 22ఏ జాబితాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ ప్రక్రియను పరిశీలించారు. అప్‌డేట్ చేసిన జాబితా ప్రకారం దరఖాస్తులను పరిశీలించి, ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రజలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకునే సమయానికే సంబంధిత ఆస్తికి 22ఏ క్లియరెన్స్ ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మేడ్చల్, దుండిగల్ తహసీల్దార్ల వద్ద ఉన్న 22ఏ జాబితాలోని ప్రతి దరఖాస్తును సంబంధిత సర్వే నంబర్లతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని జాబితాలతో సరిపోల్చి పరిశీలించారు.

22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అనుబంధ పత్రాలను పరిశీలించి, భూముల వివరాలను ధ్రువీకరించిన అనంతరం అర్హత ఉన్న దరఖాస్తులను జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

పట్టణ భూ పరిమితి కేసులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత పత్రాలు పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలో 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలన్నింటినీ సమీక్షించి, ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సజావుగా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ ఇంధన భద్రతకు బొగ్గుతో పాటు పునరుత్పాదక విద్యుత్ లో కూడా సింగరేణి కృషి

### ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో గోష్టి లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్దప్రకాష్ జ్యోతి




**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 19, ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర దేశ ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ తగినంత బొగ్గును అందించడంతో పాటు పునరుత్పాతక విద్యుత్తు రంగంలో కూడా తన వంతు కృషి చేస్తుందని సింగరేణి సంస్థ ఛైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన భారత ఇంధన భద్రత విద్యుత్ ఉత్పత్తి అనే గోష్టిలో ఆయన పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ దశాబ్దాల కాలంగా దేశ ఇంధన అవసరాలకు తనవంతుగా బొగ్గు అందిస్తూ వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి రాష్ట్ర జెన్ కో మరియు ట్రాన్స్ కో కలిసి సమష్టిగా కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ మరియు క్రిటికల్ మినరల్ రంగంలోకి కూడా ప్రవేశించిందని, అయినప్పటికీ దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తికి మరో నాలుగు దశాబ్దాల పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. సింగరేణి సంస్థ రానున్న కాలంలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తుందని అలాగే పునరుత్పాతక ఇంధన రంగంలో కూడా తన వంతు బాధ్యత నిర్వహిస్తుందని తెలిపారు.

ఈ చర్చ గోష్టికి ప్రొఫెసర్ పవన్ కుమార్ పరనంది సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ ఎనర్జీ సమ్మిట్ కు తెలంగాణ ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ హాజరుకాగా ప్యానెల్ డిస్కషన్ లో సింగరేణి ఛైర్మన్ తో పాటు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ సీఎండీ దేవేంద్ర శృంగి, ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ, గ్రిడ్ కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రియ రథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ కేదార్ రంజన్ పాండు, ఛత్తీస్ ఘడ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ ఎండీ సంజీవ్ కుమార్ కటియార్ తదితరులు పాల్గొన్నారు.

## అపోలో టైర్ల పరిశ్రమలో అగ్నిప్రమాదం గోప్యంగా ఉంచిన యాజమాన్యం

### చార్జింగ్‌లో ఉన్న బైక్ బ్యాటరీ పేలి ప్రాజెక్ట్ ఆఫీస్ దగ్ధం

### పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వలేదు

వరదయ్యపాలెం: వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు సమీపంలోని ప్రముఖ అపోలో టైర్ల పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. అయితే ఈ ఘటనను పరిశ్రమ యాజమాన్యం అత్యంత గోప్యంగా ఉంచడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.పరిశ్రమ సమాచారం ప్రకారం.. చార్జింగ్‌లో ఉంచిన ఓ ద్విచక్ర వాహనం బ్యాటరీ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో పక్కనే ఉన్న మరికొన్ని బ్యాటరీ ద్విచక్ర వాహనాలకు, సైకిళ్లకు మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రాజెక్ట్ ఆఫీస్‌లోకి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఆఫీస్‌లోని కంప్యూటర్లు, ఫర్నిచర్‌తో పాటు ఇతర సామాగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది.?ప్రమాదం జరిగిన వెంటనే పరిశ్రమ సిబ్బంది స్వయంగా మంటలను అదుపు చేసినా, ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంది. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం లేదు అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగినా పోలీసు శాఖకు గానీ, అగ్నిమాపక శాఖకు గానీ అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం ఇలాంటి ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాల్సి ఉండగా, అపోలో యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించిందనే ఆరోపణలు వస్తున్నాయి.?ఈ ఘటనను గోప్యంగా ఉంచడం వెనుక కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రతా లోపాలను కప్పిపుచ్చేందుకే యాజమాన్యం ఇలా చేసిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# ఓటరు డిజిటలైజేశన్ పై ప్రజలనుమానాల నివృత్తి.



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 19 ఆగస్టు 2026**భారత దేశ ఎన్నికల సంఘం ఆదేశానుసారం ప్రజాస్వామ్య పద్ధతి ప్రకారం తెలంగాణాలో తలపెట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్కు (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ముందు 127- మణికొండ మున్సిపల్ డివిజన్లో 33,423 ఓటరులకు గాను 17,826 (53.33 శాతం) ఓటరు డిజిటలైజేశన్ కు తోడ్పడిన్నారని, అదేవిధంగా నెక్నంపూర్ 128 మున్సిపల్ డివిజన్లో 38,431 ఓటరులు ఉండగా 21,290 (58.4 శాతం) ప్రజలు ఓటరులుగా నమోదు చేసుకున్నారని, ప్రత్యయముగా 58 పోలింగ్ స్టేషన్లకు బదులు 53 కి పరివర్తన చెందడ మనవని భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సుమనలిని, జై రామ్, షేక్ ఆరిఫ్, ముత్యాలు తదితరులు తెలిపారు. ఈ విషయమై బుధవారం రోజున శివాజి నగర్ కమ్యూనిటీ హాలు వద్ద క్రొత్తగా వెలువడిన ఓటర్ జాబితా పోలింగ్ కేంద్రం 29 మొదలుకొని 81 వరకూ ఓటరు లిస్టులు సేకరించి సవరణలో భాగంగా తమ తమ పేరులు నమోదు సక్రమంగా జరిగినవా లేదా అనే ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తూ వివరాలు తెలుపుటకు గానూ పురజనుల సౌకర్యార్థం బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు సహాయ శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సదవకాశంను స్థానికలు వినియోగించుకోని వారి కుటుంబ సభ్యులందరి ఓటు వివరాలు తెలుసు కున్నారు. మోస పూరిత వాగ్దానంలు చేయడంలో ఆరి తేరిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఒకసారి ప్రజలను ఏమార్చే విధానంగా కుటుంబ సభ్యుల అందరి ఓట్లు ఒక్క చోట లేకుండా వివిధ పోలింగ్ కేంద్రాలలో నమోదు చేయడం పరిపాటి కాగా ప్రజా సౌకర్యార్థం కుటుంబ సభ్యుల ఓట్లు అందరివి ఒకే పోలింగ్ కేంద్రాలకు వచ్చే విధంగా సర్దుబాటు చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాము లేని పక్షంలో అందుకు గాను సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇంతకు ఇంత పరిహారం చెల్లించ వలసి వస్తుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు, లిస్టులో పేర్లు నమోదు కాని వారు బూత్లెవల్ అధికారులు ఇచ్చే నోటిష్ల గురించి ప్రజలు ఎదురు చూస్తూ, వాటికి తగ్గ రుజువులు జతచేసి ఓటు హక్కును పొందడానికి సంసిద్ధత వ్యక్త పరిచారు.

# మీ సేవ యాప్‌లో ఆర్టీసీ టికెట్లు!



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధ ఆగస్టు 19 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** త్వరలోనే ఆర్టీసీ టికెట్లను 'మీ సేవ' యాప్‌లోఅందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ప్రజారవాణా సేవలు అయిన ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్.. ఇక నుంచి అన్ని ఒకే యాప్‌లో ప్రయాణికులకుఅందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా ప్రయాణికుడు ఒకేచోట నుంచి ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్‌లో తన గమ్యస్థానానికి ముందస్తుగా టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఛార్జీలను కూడా ఆన్ లైన్‌లో చెల్లించవచ్చు

## బాలికలను చదివిద్దాం బాలికలను రక్షిద్దాం
## మహిళా శక్తి బేటి బచావో బేటి పడావో అనే కార్యక్రమం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:** ఈరోజు బుధవారం అందోల్ మరియు వట్టిపల్లి కస్తూర్బా బాలికల స్కూల్ అండ్ కాలేజ్ లో, 6 వ తరగతి నుండి, ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాలికలకు, సంబంధించి కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి, బేటి బచావో బేటి పడావో అనే కార్యక్రమాన్ని, అలాగే "బాలికలను చదివిద్దాం బాలికలను రక్షిద్దాం" అనే కార్యక్రమాన్ని, ఈరోజు బుధవారం, జిల్లా మహిళా సాధికారిక శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పల్లవి, సభ అధ్యక్షతన, అలాగే ప్రిన్సిపల్ జ్యోతి , ఆధ్వర్యంలో ఈకార్యక్రమంనిర్వహించడంజరిగింది ,ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ ( చిట్టిబాబు ) అలాగే వీరితోపాటు అందోల్ జోగిపేట మున్సిపల్





కమిషనర్, తిరుపతి, మరియు స్థానిక అందోల్ తహసిల్దార్ మధుకర్ రెడ్డి, అలాగే జోగిపేట ఎస్సై దుర్గయ్య, సిడిపిఓ మధులిక, స్థానిక ఎంఈఓ బండి కృష్ణ, మాజీ వార్డు సభ్యులు సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్, సైలాన్ బాబా,వట్టిపల్లి ప్రిన్సిపల్ సుకన్య,అలాగేఉపాధ్యాయులు, కస్తూరిబా స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు....

## రోడ్డు దాటుతుండగా యువతిని ఢీకొట్టిన కారు.. అక్కడికక్కడే మృతి

రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన ఈ నెల 16న హైదరాబాద్ పరిధి మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో జరిగింది. లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతిముఖి(26) అనే యువతి పూడా అశోక్ అలోన్‌తో కలిసి భోజనం చేసి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో సంజుస్ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా, అతివేగంగా కారు నడిపి ఆమెను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలైన భారతిముఖిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# మహాసముద్రాలు, జవాబుదారీతనం మరియు ప్రపంచ పాలనపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు వేడుకను నిర్వహించిన ICFAI లా స్కూల్



**హైదరాబాద్, 19 ఆగస్టు 2026:(ప్రజా బలం ప్రతినిధి)** ICFAI లా స్కూల్, IFHE, హైదరాబాద్ ఆధ్వర్యంలో »»Oceans, Accountability and Global Governance: Interdisciplinary Perspectives on the Law of the Seaμμ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు 19 ఆగస్టు 2026న ICFAI లా స్కూల్‌లోని న్యూ ఖీూా కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ముగింపు వేడుకతో విజయవంతంగా ముగిసింది.



ముగింపు కార్యక్రమంలో రెండు రోజులపాటు జరిగిన విద్యా చర్చలు, సముద్రాలు, అంతర్జాతీయ చట్టం మరియు ప్రపంచ పాలనకు సంబంధించిన కీలక అంశాలపై వెలువడిన అభిప్రాయాలు, అవగాహనలను సమీక్షించారు. ICFAI లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డా.) పి. రవిశేఖరరాజు సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సముద్రాలకు సంబంధించిన సమకాలీన సవాళ్లను, అంతర్జాతీయ చట్టం మరియు ప్రపంచ పాలనను సమగ్రంగా అర్థం చేసుకోవడంలో అంతరశాస్త్రీయ చర్చల ప్రాధాన్యతను వివరించారు.

ICFAI లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ (డా.) వై. ప్రతాప్ రెడ్డి ముగింపు ప్రసంగం చేస్తూ, సముద్ర చట్టంపై అవగాహనను మరింత బలోపేతం చేయడంలో విద్యా సహకారం, జ్ఞాన మార్పిడి మరియు అంతర్జాతీయ అకాడమిక్ భాగస్వామ్యాల ప్రాముఖ్యతను వివరించారు. జూౕూ కోఆర్డినేటర్ డా. సాయన్ దాస్ సదస్సు నివేదికను సమర్పిస్తూ, రెండు రోజుల కార్యక్రమంలో జరిగిన విద్యా చర్చలు, ముఖ్యమైన అంశాలు మరియు సాధించిన ఫలితాలను వివరించారు.

కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శ్రీ ప్రణవ్ రైనా, Founding & Managing Partner, Vachaspatey Partners, న్యూఢిల్లీ, సముద్ర పాలనకు సంబంధించిన సమకాలీన అంశాలపై విలువైన సూచనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్భవిస్తున్న సవాళ్లను ఎదుర్కోవడంలో చట్టం, జవాబుదారీతనం మరియు సమర్థవంతమైన సముద్ర పాలన యొక్క ప్రాధాన్యతను ఆయన వివరించారు.

Vachaspatey Partners, న్యూఢిల్లీకి చెందిన మేనేజింగ్ పార్టనర్ శ్రీ దేవాన్ష్ అగర్వాల్ కూడా సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సముద్రాలకు సంబంధించిన అంశాల్లో న్యాయపరమైన పరిశోధన, అంతర్జాతీయ సహకారం మరియు బాధ్యతాయుతమైన పాలన యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం CLRPS కో–కోఆర్డినేటర్ డా. సుమంత మెహర్ వందన సమర్పణ చేస్తూ, ప్రముఖ అతిథులు, వక్తలు, ప్రతినిధులు, అధ్యాపకులు మరియు నిర్వాహకులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమిష్టి కృషి వల్ల ఈ అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించబడిందని పేర్కొన్నారు.

ఈ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ద్వారా సముద్రాలు, జవాబుదారీతనం, అంతర్జాతీయ చట్టం మరియు ప్రపంచ పాలనకు సంబంధించిన సమకాలీన అంశాలపై పండితులు, న్యాయ నిపుణులు మరియు పాల్గొన్న ప్రతినిధులు విస్తృతంగా చర్చించేందుకు ఒక విలువైన విద్యా వేదిక ఏర్పడింది. అంతర్జాతీయ సహకారం, న్యాయ పరిశోధన మరియు అంతరశాస్త్రీయ దృక్పథాల ద్వారా సముద్ర పాలనకు సంబంధించిన సవాళ్లను అర్థం చేసుకోవడంలో ఈ సదస్సు ముఖ్యమైన పాత్ర పోషించింది.

# భీమ్ ఆర్మీ జహీరాబాద్ పట్టణ నూతన కమిటీ నియామకం



జహీరాబాద్: భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) జహీరాబాద్ పట్టణ నూతన కమిటీని నియమించారు. రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధు రావణ్ అధ్యక్షతన ఈ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధు రావణ్ మాట్లాడుతూ.. వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత విధానాన్ని ఆదర్శంగా తీసుకుని భీమ్ ఆర్మీ ముందుకు సాగుతుందని తెలిపారు. బహుజన రాజ్య సాధనే లక్ష్యంగా యువతను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత కదిలితే బహుజన రాజ్యం దిశగా ఓట్లు, సీట్లు సాధించవచ్చని అన్నారు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించడం పాపంగా మారిందని, తాము బానిసలం కాదని, పాలకులుగా ఎదగాలని యువతకు సూచించారు.

నూతన కమిటీ:

జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ అలీమ్ హుస్సేన్‌ను నియమించారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ నాయకులు బాలరాజు, జైపాల్, రాహుల్, సిద్ధార్థ్, రవీందర్, రాంచందర్, మహమ్మద్ ఫరూక్, మహమ్మద్ సద్దాం హుస్సేన్, మహమ్మద్ షఫీ హుస్సేన్, మహమ్మద్ జమీల్, అబ్దుల్ గఫర్, మహమ్మద్ మజార్, మహమ్మద్ రాయిస్ తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో భారీ కార్డన్ అండ్ సెర్చ్.... 51 ద్విచక్ర వాహనాలు స్వాధీనం..

గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశాల మేరకు నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గలతూర్పుమాలపల్లిలో పోలీసులు విస్తృతంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు.?ఈ సందర్భంగా నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు మీడియాతోమాట్లాడుతూ వివరాలను వెల్లడించారు.సుమారు 100 మందిపోలీసులతో ఈ తనిఖీలను అత్యంత పకడ్బందీగా చేపట్టామని తెలిపారు. ఇల్లిల్లూ తిరిగి నిర్వహించిన ఈ తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు(రికార్డులు) లేని 51 ద్విచక్ర వాహనాలనుపోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# పరిశుభ్రత,పోషకాహారం,బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం అందోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, బాలికల భద్రత మరియు సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆడపిల్ల పుట్టుకను గౌరవించడంతో పాటు ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించడం, ఆమె ప్రతిభను ప్రోత్సహించడం, స్వయం సాధికారత సాధించేలా చేయడం సమాజం మొత్తం బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారా బాలికలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంతో పాటు ఉన్నతమైన కెరీర్ లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థినులు తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉపాధి మరియు వివిధ వృత్తి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు,కెరీర్ గోల్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ, చిన్న వయస్సు నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయపాలన, క్రమశిక్షణ మరియు నిరంతర కృషితో వాటిని సాధించాలని అధికారులు సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, తమకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు,బాలికల భద్రత మరియు రక్షణపై మాట్లాడుతూ, విద్యార్థినులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అసౌకర్యం లేదా ప్రమాదకర పరిస్థితి ఎదురైనప్పుడు నమ్మకమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా సేఫ్ టచ్ -- అన్‌సేఫ్ టచ్పై విద్యార్థినులకు అవగాహన కల్పించి, తమ శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హద్దులను తెలుసుకోవడం, అనుచిత స్పర్శను గుర్తించడం మరియు అలాంటి పరిస్థితుల్లో వెంటనే స్పందించడం వంటి అంశాలను వివరించారు,అదేవిధంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అధికారులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని, పాస్‌వర్డ్‌లు, ఓటిపి లు, ఫోటోలు మరియు ఇతర వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు, తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలని అధికారులు సూచించారు,బాలికల ఆరోగ్యానికి సమతుల్యమైన పోషకాహారం ఎంతో ముఖ్యమని, రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు,పప్పులు, ధాన్యాలు, పాలు మరియు ఇతర పోషక పదార్థాలను తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా రక్తహీనతను నివారించేందుకు ఐరన్ మరియు ఇతర పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, తగినంత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అవసరమని తెలిపారు,అనంతరం విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద మొత్తం 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు,శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, భద్రపరిచే విధానం,వినియోగం అనంతరం పరిశుభ్రంగా మరియు సురక్షితంగా పారవేసే విధానంపై అవగాహన కల్పించారు,బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, రక్షణ మరియు సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి, ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, సీడీపీఓ మాధులిక, ఎంఆర్‌వో మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈఓ కృష్ణ,ఎస్ఓ జ్యోతి, ఇన్‌చార్జి ఎస్ఓ సుకన్య, మెడికల్ ఆఫీసర్ శంకర్, జిల్లా సమన్వయకర్త పల్లవి,మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, విద్యార్థినులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



**జహీరాబాద్, ఆగస్టు 19 ప్రజాబలం ప్రతినిధి:** కేసుల దర్యాప్తులో నాణ్యత పాటిస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్, టౌన్ సర్కిల్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ.. డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, బ్యారక్స్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కేసులకు





సంబంధించిన స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనంపై సంబంధిత క్రైమ్ నంబర్ నమోదు చేయాలని, కేసు ఆస్తులను భద్రంగా ఉంచాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉండాలి

సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాల వినియోగంపై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని ఎస్పీ సూచించారు. స్టేషన్ రికార్డుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సిబ్బందికి విధుల వారీగా బాధ్యతలు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు సూచించారు. మిస్సింగ్, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఆస్తి నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్లుగా పరిగణించి పగలు, రాత్రి బీట్‌లలో నిఘా పెంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, అనుమానితులను పాపిలాన్ పరికరంతో తనిఖీ చేసి వేలిముద్రల ఆధారంగా పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని ఎస్పీ సూచించారు. గ్రామ పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే సేకరించాలని తెలిపారు. విధుల్లో అంకితభావంతో పనిచేస్తే పోలీసుశాఖకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

టౌన్ సర్కిల్ కార్యాలయ తనిఖీలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, లాంగ్ పెండింగ్ మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన కేసులను ఛేదించాలని సూచించారు.

అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, దాబాలు, పెట్రోల్ బంకుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు సూచించాలని ఆదేశించారు.

సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం

జహీరాబాద్ ప్రాంతం ఇతర రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉన్నందున అక్రమ రవాణాకు అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. సరిహద్దుల్లో నిఘా పెంచి నాకాబందీ నిర్వహిస్తూ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, రికార్డుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్పీ తెలిపారు. అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సీఐ రవి, సర్కిల్ ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యలోనే కొనసాగించాలి

## జీవో 97ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్



**జహీరాబాద్, ఆగస్టు 19 ప్రజాబలం ప్రతినిధి:** పాలిటెక్నిక్ విద్యను లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్/స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఇస్మాయిల్, ఈ గోపాల్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ అనేది మూడు సంవత్సరాల డిప్లొమా స్థాయి సాంకేతిక విద్య అని, దాన్ని కేవలం ఉద్యోగ శిక్షణగా చూడటం సరికాదన్నారు. పాలిటెక్నిక్ విద్యను ఐటీఐతో ముడిపెడితే దాని సాంకేతిక, అకడమిక్ స్వభావం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ లేటరల్ ఎంట్రీ అవకాశాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జస్వంత్, తులసీరామ్, గణేష్, కార్తీక్, హర్షవర్ధన్, కీర్తన, సలోమి, అశ్విని, మౌనిక, రాకేష్, సలీం, టింబు, ఆకాష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి దీపాలపై కౌన్సిలర్ల నిరసన



**జహీరాబాద్, ఆగస్టు 19 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు నిరసనకు దిగారు. పట్టణంలో వీధి దీపాల నిర్వహణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు సమావేశ మందిరంలో నేలపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. చైర్మన్ మహమ్మద్ యూనూస్, కమిషనర్ ప్రభాకర్ కౌన్సిలర్లకు సరైన సమాచారం ఇవ్వకుండా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారని వారు ఆరోపించారు. వీధి దీపాల నిర్వహణ, ఖర్చుల వివరాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు ఒక్కసారిగా నేలపై బైఠాయించి నిరసన చేపట్టడంతో సమావేశంలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రజాధనం విషయంలో పారదర్శకత పాటించాలని, కౌన్సిలర్లకు పూర్తి సమాచారం అందించాలని వారు కోరారు.

# వైద్యంకోసం వచ్చి విగతజీవులై: కోల్ కత్తా హోటల్లో భారీ అగ్నిప్రమాదం

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్కతాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఒక హోటల్లో మంటలు చెలరేగడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఒక చిన్నారి కూడా ఉంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..బంగ్లాదేశ్ నుంచి వైద్యంకోసం వచ్చిన పలువురు కోల్కతాలో న్యూమార్కెట్ సమీపంలోని ఒక హోటల్లో బస చేస్తున్నారు (ఐనీశ్రీనిజీబిజీ ఊనీబివశ్రీ ఈతితీవ). అంతా నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పటికే మంటలు చుట్టుముట్టడంతో వారంతా చిక్కుకుపోయారు. చనిపోయిన తొమ్మిది మంది బంగ్లాదేశ్ జాతీయులని అధికారులు వెల్లడించారు. ఏసీలో పేలుడే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రస్తుతం మంటలు ఆరిపోయాయి. ఈ ఘటనలో ఆరుగురికిపైగా గాయపడ్డారు.ఇటీవలే బెంగాల్ (చివబబి ఃవనిణజీశ్రీ)లోని బీరభూమ్ జిల్లా తారాపీఠ్ ఒక హోటల్లో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. మంటలు చెలరేగడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గ్రౌండ్ ఫ్లోర్లోని హోటల్ రిసెప్షన్లో మొదలైన మంటలు.. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉండటంతో ప్రాణనష్టం జరిగింది.

## ఉదయ్ కృష్ణారెడ్డికి డీఎన్ఏ టెస్టులు!

అత్యాచారం, హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతి మంజూరు చేసింది. బాధితురాలి గాయాలు, దుస్తులపై లభించిన ఆధారాలతో నిందితుడి బ్లడ్ శాంపిళ్లను పోల్చనున్నారు. పోలీసు కస్టడీ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో, పోలీసులు కీలక ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సూసైడ్ నోట్, ఐఫోన్, రహస్య వీడియోలు ఎక్కడున్నాయనే ప్రశ్నలకు ఉదయ్ కృష్ణారెడ్డి 'నాకు తెలియదు' అని సమాధానమిచ్చినట్లు సమాచారం.

## మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ...
## డివిజన్ అధ్యక్షుడు కిలారు శ్రీనివాస బాబు



**కూకట్‌పల్లి(ప్రజాబలం ) ఆగస్టు19:** వసంతనగర్ డివిజన్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. వసంతనగర్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కిలారు శ్రీనివాస బాబు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ద్వారా మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. చీరలు అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిలారు శ్రీనివాస్ బాబు తో పాటు మహిళా అధ్యక్షురాలు రజిత, ఆర్ పీ అక్షయ,సాయి తేజ కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు స్థానిక మహిళలు, లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొని ఇందిరమ్మ చీరలను స్వీకరించారు.

## ఎస్ఐఆర్ లో మ్యాపింగ్ కాని ఓటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి...అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు,బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.,సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్ సంగీత, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని, ఓటర్ల నుంచి వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. సమర్పించిన ధ్రువపత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని సూచించారు.

నోటీసుల జారీ, క్లెయిమ్‌లు--అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశించారు.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జిల్లాలో మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 3,47,688 అనామలీస్ ఉన్నట్లు వివరించారు. వీరందరికీ నిబంధనల ప్రకారం సరైన విధానంలో నోటీసులు జారీ చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఏఈఆర్‌ఓలు మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌కు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షిస్తున్నామని ఆమె తెలిపారు.

ఓటర్లు నిర్ణీత సమయంలో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, మొత్తం ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి....
## ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి చర్చించారు,ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా ఆర్‌అండ్‌బీ రోడ్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న రహదారి పనుల పురోగతిపై కలెక్టర్‌తో చర్చించారు,గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన బోర్ల ఏర్పాటు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సబ్ సెంటర్ల అభివృద్ధిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు,అలాగే

సి ఎస్ ఆర్, డి ఎం ఎఫ్ టి, ఎం ఎస్ టీ,తదితర నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, అందుబాటులో ఉన్న నిధులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు పెండింగ్ పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు,ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలు సూచించారు,ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి సూచనల మేరకు ఈరోజు మూడవ జిల్లా అదనపు న్యాయమూర్తి మాధురి కృష్ణ బుధవారం నాడు బ్యాంక్,చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది,సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతంగా నిర్వహించేందుకు బ్యాంకులు, చిట్‌ఫండ్ సంస్థలు,ఇన్సూరెన్స్ సంస్థల అధికారులతో పాటు స్టాండింగ్ అడ్వొకేట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించదగిన కేసులను గుర్తించడం, పెండింగ్‌లో ఉన్న వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం, సంబంధిత పక్షాలకు ముందస్తుగా సమాచారం అందించడం వంటి అంశాలపై చర్చించారు. బ్యాంకులు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ సంస్థలు మరియు స్టాండింగ్ అడ్వొకేట్లు తమ పరిధిలోని కేసులను పరిశీలించి,ఎక్కువ సంఖ్యలో కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కారమయ్యేలా సహకరించాలని సూచించారు.

ప్రజలు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న తమ కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి మాధవి కృష్ణ మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య,లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్, బ్యాంక్ అధికారులు చిట్ఫండ్ అధికారులు ఇన్సూరెన్స్ అధికారులు స్టాండింగ్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా జరిగిన ఆరోరా జన్మదిన వేడుకలు



**కూకట్పల్లి (ప్రజాబలం ) ఆగస్టు 19:** బిఆర్ఎస్ పార్టీ కూకట్పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా జన్మదిన శుభ సందర్భంగా బాలాజీ నగర్ డివిజన్ నందు మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు డివిజన్ సెక్రెటరీ వెంకటేష్ చౌదరి సీనియర్ నాయకుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శివానంద రిహాబిలిటేషన్ సెంటర్, రాందేవ్ హాస్పిటల్ నందు పేషెంట్లకు పళ్ళు బ్రెడ్స్ పంచిపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సతీష్ అరోరా గత ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అడుగుజాడల్లో నడుస్తూ నిరంతరం పార్టీ కోసం, కార్యకర్తల కోసం అహర్నిశలు కష్టపడుతూ తనదైన వ్యూహాలతో పార్టీని విజయపథంలో నడిపించే చిన్నన్న జన్మదిన మన మధ్య చేసుకోవటం ఎంతో ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు.ఈకార్యక్రమంలో రాందేవ్ హాస్పటల్ సూపర్నెంట్ యోబు సార్, కల్పనా మేడం, నాయినేని చిన్న తులసి రావు , సీనియర్ నాయకులు కంచనపల్లి నాగరాజు,వట్టి ఉపేందర్ రెడ్డి, పులి మురళి, తదితర సీనియర్ నాయకులు మహిళలుపాల్గొన్నారు




## దేశ ఇంధన భద్రతకు బొగ్గుతో పాటు పునరుత్పాదక విద్యుత్ లో కూడా సింగరేణి కృషి
## ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో గోష్టి లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 19, ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర దేశ ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ తగినంత బొగ్గును అందించడంతో పాటు పునరుత్పాతక విద్యుత్తు రంగంలో కూడా తన వంతు కృషి చేస్తుందని సింగరేణి సంస్థ ఛైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన భారత ఇంధన భద్రత విద్యుత్ ఉత్పత్తి అనే గోష్టిలో ఆయన పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ దశాబ్దాల కాలంగా దేశ ఇంధన అవసరాలకు తనవంతుగా బొగ్గు అందిస్తూ వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి రాష్ట్ర జెన్ కో మరియు ట్రాన్స్ కో కలిసి సమష్టిగా కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ మరియు క్రిటికల్ మినరల్ రంగంలోకి కూడా ప్రవేశించిందని, అయినప్పటికీ దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తికి మరో నాలుగు దశాబ్దాల పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. సింగరేణి సంస్థ రానున్న కాలంలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తుందని అలాగే పునరుత్పాతక ఇంధన రంగంలో కూడా తన వంతు బాధ్యత నిర్వహిస్తుందని తెలిపారు.

ఈ చర్చ గోష్టికి ప్రొఫెసర్ పవన్ కుమార్ పరనంది సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ ఎనర్జీ సమ్మిట్ కు తెలంగాణ ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ హాజరుకాగా ప్యానెల్ డిస్కషన్ లో సింగరేణి ఛైర్మన్ తో పాటు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ సీఎండీ దేవేంద్ర శృంగి, ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ, గ్రిడ్ కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రియ రథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ కేదార్ రంజన్ పాండు, ఛత్తీస్ ఘడ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ ఎండీ సంజీవ్ కుమార్ కటియార్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com